ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



గుంటూరు జిల్లా వార్తలు

మంగళవారం 20 ఫిబ్రవరి 2024



రోడ్డుపై పారుతున్న మురుగునీరు

చస్తున్నా.. చూస్తూనే!


- ఏళ్ల తరబడి మురుగునీటిలోనే పైపులైన్లు
- ఇప్పటికీ కొనసాగుతున్న పైపులైన్ల మరమ్మతులు
- ప్రజలు మృతి చెందుతున్నా చోద్యం చూస్తున్న ఇంజనీర్లు
- జీఎంసీకి పూర్తిస్థాయిలో ఎస్‌ఈ నియామకం ఏది?
- ప్రభుత్వానికి, ప్రజా ప్రతినిధులకు లోపించిన చిత్తశుద్ధి



దహీరా మసీదు రోడ్‌లో...



ఎల్‌ఆర్ కాలనీ మెయిన్ రోడ్డులో..



సంగడిగుంటలో...



ఐపీడీ కాలనీలో...



ఐపీడీ కాలనీలో...





ఆనందపేటలో...



మురుగునీటిలోనే తాగునీటి పైపులైన్లు



గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 19: ఆ పైప్ లైన్ వేసి ఎన్నో ఏళ్ల గడుస్తోంది. ఆ పైప్‌లైన్‌లోనే మురుగు నీరు కలుస్తోంది. ఓ పక్క నగరంలో డయేరియా ప్రబలి నలుగురిని పొట్టన పెట్టుకుంది. అయినా నగరపాలక సంస్థ ఇంజనీరిం గ్ అధికారులలో ఎటువంటి చలనం లేదు. ఆనంద పేట, సంగడిగుంట, లాంచెస్టర్ రోడ్, శారదా కాలనీ, శ్రీనగర్ కాలనీ, రైలుపేట ఇలా అనేక కాలనీ ల్లో పైపులైన్లన్నీ మురుగునీటి కాలువల్లోనే ఉన్నా యి. ఈ ప్రాంతాల్లోనే డయేరియా ప్రబలింది. అయినా మురుగునీటిలో పైపులైన్లను తప్పించే పనిని ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. తరచుగా లీకులు ఏర్పడి వాటి ద్వారా పైప్ లైన్‌లోకి డ్రైనేజి వాటర్ వచ్చి సరఫరా అవుతోంది. దీంతో ఆ కలుషిత నీరు తాగిన వారు అస్వస్థతకు గురవుతున్నారు.

గాలికి వదిలేసిన నిబంధనలు...

రోజు నగరపాలక సంస్థ సరఫరా చేస్తున్న నీటిని క్షేత్రస్థాయిలో పలు దఫాలుగా పరిశీలించాలి. గుంటూరు తక్కెళ్ళపాడు హెడ్ వాటర్ వర్క్స్ వద్ద టర్బిటరీ, క్లోరిన్ శాతం చూస్తారు. అక్కడినుంచి సమీప రిజర్వాయర్‌కు వచ్చిన తర్వాత అక్కడ కూడా క్లోరిన్ శాతం పరిశీలిస్తారు. ఆ తర్వాత నీరు సరఫరా అయినా ప్రాంతాల్లో ర్యాండమ్‌గా కొన్ని బజార్లలో నీటి శాతాన్ని పరిశీలిస్తారు. ఇలా అనేక దఫాలుగా తాగునీటిని పరిశీలిస్తారు. అటువంటిది ఈ మధ్యకాలంలో నీటి సరఫరా చేస్తున్న సమయంలో ఎటువంటి శాంపిల్స్ తీయటం లేదు. దీంతో పలు ప్రాంతాల్లో కలుషిత నీరు సరఫరా అవుతోంది. ఇంత పెద్ద నగరపాలక సంస్థకు పూర్తిస్థాయిలో సూపరిం టెండెంట్ ఇంజనీర్ (ఎస్‌ఈ) స్థాయి అధికారి లేరు. ఇప్పటివరకు ఈఈ సుందర రామిరెడ్డిని ఇన్‌చార్జి ఎస్‌ఈగా కొనసాగిస్తున్నారు. పూర్తిస్థాయి ఎస్‌ఈ లేకపోవడంతో కింది స్థాయి అధికారులు కూడా బాధ్యతగా పనిచేయడం లేదు. మొత్తానికి ముందు జాగ్రత్తలు చేపట్టడంలో ప్రభుత్వానికి, ప్రజా ప్రతినిధులకు చిత్తశుద్ధి లేదనే విషయం స్పష్టం అవుతోంది.

సిబ్బందిపై వేటు.. ఆరుగురి సస్పెన్షన్

విధుల్లో నిర్లక్ష్యం కనపరిచిన వారిపై చర్యలు తప్పవని నగర కమిషనర్ కీర్తి చేకూరి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. శారదకాలనీలో తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణలో అలసత్వం చూపిన సిబ్బందిపై వేటు వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఏఈ ఎం.అనూష, ఎమినిటి కార్యదర్శులు వి.నాగరామకోటయ్య, ఎం.శ్రుతికీర్తన, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏ.రాము, శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ కార్యదర్శులు ఎన్.ఆంజనేయులు, డి.వెంకట సురేష్ విధుల నుంచి సస్పెండ్ చేశారు. అదేవిధంగా వాల్వ్ ఆపరేటర్ చెంచయ్యను విధుల నుంచి తొలిగించారు. ఈఈ కె.కోటేశ్వరరావుకు, శానిటేషన్ సూపర్‌వైజర్ ఆయుబ్ ఖాన్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు.





తాడిశెట్టి సోదరులను గజమాలతో సన్మానం, ఆత్మీయ సమావేశానికి హాజరైన అభిమానులు

- బీసీలు, కాపులకు స్థానం లేదు
- పార్టీ కోసం కష్టపడిన వారిని స్థానిక నాయకత్వం నిర్లక్ష్యం చేసింది
- 15 రోజుల్లోనే సముచిత రాజకీయ నిర్ణయాన్ని ప్రకటిస్తాం
- ఆత్మీయ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వెంకటరావు

వైసీపీలో.. అణచివేత

గుంటూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): వైసీపీలో బలహీనవర్గాలకు స్థానం లేదని, జగన్ సామాజికవర్గానికే న్యాయం జరుగుతోందని గుంటూరు-2 మాజీ ఎమ్మెల్యే తాడిశెట్టి వెంకటరావు ఆరోపించారు. బీసీలు, కాపులు తీవ్ర అణచివేతకు గురవుతున్నారని చెప్పారు. దీనంతటికి కారణం ఆ పార్టీలో స్థానిక నాయకత్వమేనన్నారు. సోమవారం నగరంలోని రింగురోడ్డులో ఉన్న శుభం కన్వెన్షన్ సెంటర్‌లో తాడిశెట్టి సోదరుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి గుంటూరు లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీస్థానాల నుంచి వారి అనుచరులు వేలసంఖ్యలో హాజరయ్యారు. అంతకు ముందు స్వామిథియేటర్ నుంచి భారీ వాహనర్యాలీ జరిగింది. కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన సభకు నగర కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు మాదా రాధాకృష్ణమూర్తి అధ్యక్షత వ హించారు. సభకు హాజరైన పలువురు వక్తలు తాడిశెట్టి సోదరులకు వైసీపీలో జరిగిన అన్యాయంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ పార్టీలో ఇకపై కొనసాగవద్దని, రాజకీయ పరంగా ఏ నిర్ణయం తీసుకొన్నా తాము అండగా ఉంటామన్నారు.

తాడిశెట్టి వెంకటరావు ప్రసంగిస్తూ మా రాజకీయ జీవితం మీతోనే ముడిపడింది. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని ఎమ్మెల్యేగా గెలిచి మీకు సేవచేసి మన్ననలు పొందాను. తన తర్వాత సోదరుడు తాడిశెట్టి మురళీమోహన్ మీకు అండగా నిలిచారని చెప్పారు. ఐదేళ్లుగా వైసీపీలో కొనసాగుతూ గౌరవం కోసం ప్రయత్నించామే తప్పా పదవులు ఆశించలేదన్నారు. తమని స్థానిక నాయకత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసిందని, అన్యాయంగా ప్రవర్తించిందన్నారు. వారి వైఖరిపై తాను పూర్తిగా విభేదిస్తున్నానని, వారిపై ఈ రోజు నుంచే పోరాటాన్ని ప్రకటిస్తున్నానన్నారు. మీ అందరి సహకారంతో కొత్త ప్రయాణానికి అడుగులు వేసే సమయం ఆసన్నమైందని, 15 రోజుల్లోనే సముచితమైన రాజకీయ నిర్ణయం తీసుకొని మళ్లీ మీ ముందుకు వస్తామన్నారు. మా ప్రధానబలం బీసీలతోపాటు కాపు సోదరులని, వారి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. వైసీపీలో జగన్ సామాజికవర్గానికి తప్ప ఎవ్వరికి పదవులు రావన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ తాడిశెట్టి మురళీమోహన్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి అహర్నిశలు అందరం కలిసి శ్రమించామన్నారు. ఎన్నికల ముందు, ఆ తర్వాత సీఎం జగన్‌ని కలిసినప్పుడు సముచిత స్థానం కల్పిస్తామని మాట ఇచ్చారు. ఆ మాటకు కట్టుబడి ఐదేళ్లుగా ఎంతో ఓర్పు, సహనంతో ఎదురుచూశాం. అందరికి ఎమ్మెల్సీలు, సలహాదారులు, కార్పొరేషన్ల చైర్మన్ల పదవులు ఇచ్చారు. గుంటూరులో కూడా ముగ్గురికి ఎమ్మెల్సీ పదవులు ఇచ్చారు. వాళ్ల కంటే మేము పార్టీకి ఏమి తక్కువ చేశామని పక్కన పెట్టారని ప్రశ్నిస్తున్నానన్నారు. సీఎం కింద ఉన్న వ్యవస్థ మా సేవల్ని జగన్ వరకు చేరనీయకుండా చేసిందన్నారు. ఏమి చేయని వాళ్లని హీరోలుగా, అన్ని చేసిన వారిని జీరోలుగా ఆ వ్యవస్థ చిత్రీకరించడం దారుణమన్నారు. సీఎంని కలిసినప్పుడల్లా అన్నా.. నిన్ను టీటీడీ బోర్డు మెంబరుగా నియమిస్తున్నానని చెప్పేవారు, ప్రతీసారి నెక్స్‌టైం అంటూ దాట వేసేవారన్నారు. మాకు 35 ఏళ్లుగా అండగా నిలుస్తున్న మీ అందరి సహకారంతో రాబోయే ఎన్నికల్లో ఒక నిర్ణయం తీసుకొని ముందుకెళదామన్నారు

సభ అనంతరం తాడిశెట్టి సోదరులను ఆయన అభిమానులు గజమాల, పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ కార్పొరేటర్ శ్రీవల్లి, మాజీ కార్పొరేటర్లు పాలపర్తి రాము, ఆడపా కాశీవిశ్వనాథం, సంబరాసు వాసు, వివిధ పార్టీల నాయకులు మలిశెట్టి సుబ్బారావు, నారదాసు వీరమహేంద్ర, దొడ్డి కోటేశ్వరరావు, కాజావలి, మిరియాల గోపి, సింగంశెట్టి కోటేశ్వరరావు, అంగిరేకుల వరప్రసాదయాదవ్, తట్టుకోళ్ల కేశవయ్య, గులకవరపు రవికుమార్, దళవాయి రాఘవేంద్ర, స్టాలిన్, మహతి శంకర్, విస్సా క్రాంతికుమార్, అన్నంరాజు సాయిరాం, యర్రంశెట్టి వేణు తదితరులు పాల్గొన్నారు.

- డోర్ నెంబర్లను సరి చేయని నగరపాలకసంస్థ
- చాలా ప్రాంతాల్లో పాత నెంబర్లతోనే ఓటర్ జాబితాల తయారీ
- అపార్టుమెంట్‌ల పేర్లు, అడ్రస్‌లు లేకుండా కేవలం ఫ్లాట్ నెంబర్ల చేర్పు
- శ్రీనగర్, చౌత్రా సెంటర్లలోని ఓటర్లను పశ్చిమలోకి బదిలీ
- సరి చేయాలని ఎన్ని ఫిర్యాదులు చేసినా బుట్టదాఖలు

రాంగ్ నెంబర్

గుంటూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాల్లో డోర్ నెంబర్ల తప్పులన్నీ సరిచేశామని నగరపాలకసంస్థ అధికారులు చెబుతున్న మాటలు సత్యదూరంగా ఉన్నాయి. దాదాపుగా 60వేలకు పైగా ఓటర్ల డోర్ నెంబర్లలో తప్పులను సరి చేయలేదు. కొత్త డోర్ నెంబర్ల విధానం అమలులోకి రాగా దానిని పాటించకుండా చాలా ప్రాంతాల్లో పాత డోర్ నెంబర్లతోనే తుది ఓటర్ జాబితాలను ముద్రించారు. అపార్టుమెంట్ల ఫ్లాట్లనెంబర్ల విషయంలోనూ శాస్త్రీయతని పాటించలేదు. డోర్ నెంబరు, అపార్టుమెంట్ పేరు లేకుండా కేవలం ఫ్లాట్ నెంబర్లు.101, 102 అని వేసుకొంటూ పోయారు. దీనివలన ఎన్నికల సమయంలో ఓటర్ల చిరునామాలు గుర్తించడం చాలా కష్టమౌతోంది.


గత ఎన్నికల సమయంలోనే ఓటర్ స్లిప్పులను నగరపాలకసంస్థ అధికారులు పంపిణీ చేయలేక చివరల్లో చేతులెత్తేశారు. అదే పరిస్థితి కొద్ది రోజుల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లోనూ పునరావృతమయ్యే పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి.

ఒక్కో ఏరియాకి సీరియల్ నెంబరు

నగరంలో ప్రతీ ఇంటికి కొత్త డోర్ నెంబరు కేటాయిస్తూ గత ఏడాది జూన్‌లోనే నగరపాలక సంస్థ కమిషనర్ ప్రొసీడింగ్స్ జారీ చేశారు. ఒక్కో ఏరియాకి సీరియల్ నెంబరు కేటాయించారు. అయితే అరండల్‌పేట, శ్యామలానగర్, బృందావన్‌గార్డెన్స్, కొరిటెపాడు, సిద్ధార్థనగర్, విద్యానగర్ తదితర ప్రాంతాల్లో పాత డోర్ నెంబ ర్లని అలానే ఉంచి ఓటర్ల జాబితాలు ముద్రించారు. గుంటూరు పశ్చిమలో 1 నుంచి 27 పోలింగ్ బూత్ నెంబర్లలో డోర్ నెంబర్ల తప్పులు ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి. తుపాను నగర్‌లోనూ పాత డోర్ నెంబర్లే ఉన్నాయి. డోర్ నెంబరింగ్ విధానం ప్రకారం ఒక ఏరియా చుట్టూ మెయిన్ రోడ్డులో ఉండేవాటికి రెండు అంకెలతో డోర్ నెంబర్లు ఇచ్చారు. ఆ లోపల ఉన్నవాటికి మూడు అంకెలతో ఇచ్చారు. ఒక అపార్టుమెంట్‌కి ఒక్కటే డోర్ నెంబరు ఉంటుంది. దానిని ఆధారంగా చేసుకొని ఆ అపార్టుమెంట్‌లో ఏ, బీ, సీ, డీ.. బ్లాకులు, ఆ బ్లాకుల్లో ఫ్లాట్ నెంబర్లను డోర్ నెంబర్‌లో పేర్కొనాలి. అయితే ఓటర్ జాబితాల్లో అలా కాకుండా ఎలాంటి డోర్ నెంబరుని పొందుపరచకుండా కేవలం ఫ్లాట్ నెంబరు వేసేసి సరిచేశామని అధికారులకు తప్పుడు నివేదికలు ఇచ్చారు.

ఓటర్లను గుర్తించడం కష్టతరం..

ఇప్పుడు ఆ ఫ్లాట్ నెంబర్లు పట్టుకొని ఓటర్లను గుర్తించడం చాలా కష్టమౌతోంది. కనీసం ఏరియా, వీధి నెంబరు, అపార్టుమెంట్ పేరు అన్నా ఉంటే కొంత సులభతరం అవుతుంది. అయితే ఓటర్ జాబితాలో ఇవేమీ లేకపోవడంతో ఓటరు చిరునామాలు గుర్తించలేని పరిస్థితి. ఇది కూడా గుంటూరు నగరంలో ఓటింగ్‌శాతం తగ్గడానికి ఒక కారణంగానే ఓటర్ జాబితాలను విశ్లేషిస్తున్న సాఫ్టవేర్ ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు. వీటిని సరి చేయమని జిల్లా స్థాయి నుంచి సీఈవో వరకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని వారు చెబుతున్నారు. శ్రీనగర్ ఏరియా చాలావరకు గుంటూరు తూర్పులోనే ఉన్నది. అయినప్పటికీ అక్కడి ఓటర్లను తీసుకొచ్చి పశ్చిమలోని పోలింగ్ బూత్‌లలో వేశారు. అలానే చౌత్రా సెంటర్ ఓటర్లను కూడా పశ్చిమలో చేర్చారు. ఇప్పుడు చిలకలూరిపేటలోని పురుషోత్తంపట్నం నుంచి ఓటర్లను తీసుకొచ్చి గుంటూరు పశ్చిమలోని వేర్వేరు ప్రాంతాల్లో చేరుస్తున్నారు. ఇవన్నీ వైసీపీ అభ్యర్థికి ఎన్నికల్లో లబ్ధి చేకూర్చిపెట్టేందుకే అన్నట్లుగా ఉన్నాయని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.



292	NDX3680717
Name : Mannava Meena	Photo Available
Husbands Name : Ghanta Srinivas	
House Number : Flot No 301	
Age : 43 Gender : Female	

293	NDX3680782
Name : Ghanta Srinivas	Photo Available
Fathers Name : Ghanta Venkatarao	
House Number : Flot No 301	
Age : 43 Gender : Male	

డోర్ నెంబర్, అపార్టుమెంట్, ప్రాంతం పేరు లేకుండా ఫ్లాట్ నెంబరుతో ముద్రించిన తుది ఓటర్లు



నకిలీ దందా

- నడ్డివిరిచిన నకిలీ విత్తనాలు
- దుగ్గిరాల రైతులు పూర్తిగా మునిగిపోయారు...
- మిర్చి రైతుల నష్టం అపారం
- అక్కడ కేజీ రూ.6 వేలు కొని.. ఇక్కడ రూ.1.20 లక్షలకు అమ్మకం
- ఉద్యోగులకు కంపెనీల్లో వాటాలు
- గుంటూరు నుంచే అన్ని చోట్లకు సరఫరా

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 19: విత్తన ఎంపికలోనే రైతు మీద దెబ్బ పడుతోంది. ఏది అసలో ఏది నకిలీనో తెలుసుకోలేని సందిగ్ధావస్థ అన్నదాతను తిప్పలపాలు చేస్తోంది. ఖరీఫ్, రబీ అన్న తేడా లేకుండా రైతులు విత్తనాల విషయంలో మోసపోతూనే ఉన్నారు. విత్తనాల కంపెనీల మాటల ఆకర్షణలో పడి నిండా మునిగిపోతున్నారు. పంట చేతికి రావలసిన సమయానికి మోడుబారిన చెట్లను చూసి గుండె పగులుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని ప్రాంతాలకు నగరంలో నుంచే విత్తనాలు సరఫరా అవుతున్నాయి. వాటిల్లో చాలాభాగం నకిలీవి కూడా ఉంటున్నాయి. ఉన్నతస్థాయి అధికార యంత్రాంగం ఇక్కడే ఉన్నప్పటికీ పర్యవేక్షణ కరువవ్వటంతో అన్నదాతల బతుకుల్లో బండలు పడుతున్నాయి. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో పనిచేసే కొందరు ఉద్యోగులకు విత్తనాల కంపెనీల్లో వాటాలు ఉన్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

రైతు శ్రమ బూడిదలో పోసిన పన్నీరు..

దుగ్గిరాల మండలం మంచికలపూడిలో కొందరు రైతులు క్యాలీఫ్లవర్ సాగు చేశారు. అందుకోసం గుంటూరు నుంచి విత్తనాలను తీసుకువెళ్లారు. 75 రకం, వైట్ సుప్రీమ్ గోల్డ్ విత్తనాలను సాగు చేశారు. పైరు ఏపుగా పెరిగింది కానీ పువ్వు రాలేదు. పెరిగిన పైరు క్రమంగా ఎండిపోయింది. అది గమనించిన రైతులు స్థానిక వ్యవసాయ శాఖ అధికారుల వద్దకు పరుగులు తీశారు. తాము మోసపోయామని గ్రహించారు. ఈ పంట సాగుకు ఒక్కో రైతుకు సుమారు రూ.60 వేల వరకు వరకు ఖర్చయినట్లు తెలుస్తోంది. విత్తనాలు ప్యాకెట్లు కూడా ఒక్కొక్కటి రూ.6 వేలు చొప్పున కొనుగోలు చేశారు. పెదనందిపాడుకు చెందిన కిషోర్ ఈ ఏడాది మిర్చిపంట సాగు చేశాడు. అన్నవరం సమీపంలో పొలాన్ని కౌలుకు తీసుకొని సాగుకు ఉపక్రమించాడు. మొక్కలు ఏపుగా పెరిగినప్పటికీ కాపు రాకపోవడంతో పంటను ధ్వంసం చేసి శనగ వేసుకున్నాడు. శనగ విత్తనాలు రైతు భరోసా కేంద్రాల నుంచే తీసుకున్నప్పటికీ అవి కూడా సరిగా మొలవకపోవడంతో ఆ పంటను తీసేసి మొక్కజొన్న నాటుకు న్నాడు. పల్నాడు జిల్లా అచ్చంపేట మండ లం తాళ్ళచెరువులో కొందరు రైతులు గుంటూరు నుంచి తీసుకువెళ్లారు. మిర్చి విత్తనాలను నారుగా పోశారు. అవి మొల కెత్తక పోవటంతో అధికారులకు ఫిర్యాదు చేశారు. రెంటచింతల మండ లంలోని కొందరు రైతులు ఇదే అనుభవాన్ని ఎదుర్కొన్నారు. విత్తనాలను విక్రయిస్తున్న డీలర్లు రైతుల్లోని నిరక్షరాస్యతను అడ్డం పెట్టుకొని మోసం చేస్తున్నారు. అందమైన ప్యాకింగ్ లను చూపించి విత్తనాలను రైతులకు అంట గడుతున్నారు. విత్తనాలు విక్రయించే సందర్భంలో తగినవిధంగా బిల్లులు ఇవ్వకపోవడంతో రైతులు పోరాడే అవకాశాన్ని కోల్పోతున్నారు.

మిర్చి విత్తనాలకు ఇదే సీజన్..



ఇతర రాష్ట్రాల నుంచి ఆంధ్రాకు వివిధ రకాల విత్తనాలు ఫిబ్రవరి, మార్చి నెలలోనే సరఫరా అవు తాయి. కర్ణాటక లోని రాణి బెంగళూరు ప్రాంతం నుంచి మిర్చి విత్తనాలను గుంటూరు వ్యాపారులు కొనుగోలు చేస్తారు. అక్కడ మిర్చి విత్తనాలు కేజీ రూ.6 వేలకు కొనుగోలు చేసి ఇక్కడ గ్రాముల చొప్పున ప్యాకింగ్ చేస్తారు. ప్యాకింగ్ చేసిన విత్తనాలను కేజీ రూ.లక్షా ఇరవై వేల వరకు అమ్మడం జరుగుతుంది. మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల నుంచి పత్తి విత్తనాలను కొనుగోలు చేసి తీసుకొస్తారు. వాటికి యాసిడ్, సున్నం కలిపి ఆరబెట్టిన తర్వాత ప్యాకింగ్ చేస్తారు. వాటిని కూడా అధిక ధరలకు విక్రయిస్తున్నారు. గుంటూరు నగరం లో సుమారు 20వరకు విత్తన కంపెనీలు ఉన్నాయి. విత్తన నాణ్యతను పెద్దగా పరిశీలించకుండానే డైరెక్ట్‌గా మార్కెట్లోకి విడుదల చేయటంతో రైతులు సాగులో నష్టపోతున్నారు.

తనిఖీలు లేవు...

రాష్ట్రాల నుంచి గుంటూరుకు మిర్చి పత్తి విత్తనాలు స్థానిక పార్సిల్ కేంద్రాల ద్వారా సరఫరా అవుతున్నాయి. సరైన రీతిలో తనిఖీలు జరపకపోవడంతో నకిలీ విత్తనాలు మార్కెట్లోకి వెళ్లిపోతున్నాయి. వ్యవసాయ శాఖలోని కొందరు ఉద్యోగులు విత్తన కంపెనీలో వాటాదారులుగా ఉండటంతో తనిఖీలు తూతూమంత్రంగా సాగుతాయన్న అపప్రద ఉంది.



మందడం రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్నరైతులు

విధ్వంసం తప్పితే అభివృద్ధి శూన్యం

● 1525వ రోజుకు చేరుకున్నరైతుల ఆందోళనలు

తుళ్లూరు, ఫిబ్రవరి 19: ప్రజావేదిక కూల్చివేతతో సీఎం జగన్‌రెడ్డి పాలన ప్రారంభమైందని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు సోమవారం నాటికి 1525వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, కూల్చటం, పడగొట్టడం జగన్‌రెడ్డి విధానమన్నారు. ఎంతో శక్తివంతమైన అమరావతిని నాశనం చేయటం ఎవరి తరం కాదన్నారు. ఎప్పటికైనా ఐదుకోట్ల మంది ఆంధ్రుల రాజధాని అమరావతేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి గుండు సున్నా అని పేర్కొన్నారు. విధ్వంసకర పరిపాలన చేస్తున్న జగన్‌రెడ్డి ఇంటికి పంపటమే లక్ష్యంగా ప్రజలు ఉన్నారన్నారు. దోచుకోవటం ఒక్కటే వైసీపీ పాలకులకు తెలుసునని అన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం చెప్పిన తీర్పు ప్రకారం అమరావతి అభివృద్ధిని కొనసాగించాలన్నారు. మూడు ముక్కల ఆటతో రాష్ట్రాన్ని నాశనం చేయవద్దన్నారు. దోచుకోవటం ఆపి ప్రజాసేవ చేయాలని హితవు పలికారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాలతో పాటు మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల్లో మూడు రాజధానులకు వ్యతిరేకంగా రైతులు ఆందోళనలు నిర్వహించారు.

మాచర్లలో ప్రత్యేక రాజ్యాంగం నడుస్తోంది

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి



షాపింగ్ కాంప్లెక్స్‌లు, డూప్లెక్స్ హౌస్‌ల నిర్మాణాలను చూపుతున్న బ్రహ్మారెడ్డి

మాచర్ల, ఫిబ్రవరి 19: మాచర్లలో అంబేడ్కర్ రాజ్యాంగం నడవడం లేదని, ప్రత్యేక రాజ్యాంగం నడుస్తోందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి అన్నారు. పట్టణంలోని పీడబ్ల్యూడీ కాలనీలో ఎమ్మెల్యే పీఆర్కే పంపిణీ చేసిన నివేశన స్థలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ పీడబ్ల్యూడీ కాలనీలో దశాబ్దాల కాలంగా నివాసముంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను కాదని, తన అనుచరులకు కాలనీలో సుమారు నాలుగు సెంట్ల చొప్పున పిన్నెల్లి సోదరులు దోచి పెట్టారన్నారు. నిబంధనలను కాదని ఇక్కడ షాపింగ్ కాంప్లెక్స్‌లు, డూప్లెక్స్ హౌస్‌లు నిర్మిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరందరూ నిరుపేదలా.. పెత్తందారులా అని ప్రశ్నించారు. నిత్యం నా ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు అంటూ ఊదరగొట్టే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దీనికేం సమాధానం చెబుతారన్నారు. టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి రాగానే పీడబ్ల్యూడీ కాలనీలో పంపిణీ చేసిన స్థలాలపై, నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపించి దశాబ్దాల కాలంగా కాలనీలో నివాసముంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు న్యాయం చేసే బాధ్యతను తీసుకుంటామన్నారు. చోద్యం చూస్తున్న అధికారులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. బ్రహ్మారెడ్డి వెంట యెనుముల కేశవరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, లెనిన్‌బాబు, మోసిన్, మున్నా రాంబాబు, సాతులూరి కుమార్, బొల్లెద్దుల ప్రకాష్, బాబు, నూకరాజు, శ్రీనివాసరవు, కొమెర శివ తదితరులు ఉన్నారు.

స్వర్ణ యుగమో.. రాతియుగమో తేలుద్దామా?

● కన్నా లక్ష్మీనారాయణ



కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 19: ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభివృద్ధిపై దమ్ముంటే వైసీపీ నాయకులు బహిరంగ చర్చకు సిద్ధం కావాలన్నారు. ఎవరి పాలన స్వర్ణయుగమో, ఎవరి పాలన రాతి యుగమో తేల్చాద్దామన్నారు. రాష్ట్ర అభివృద్ధిపై చర్చించేందుకు వైసీపీ నాయకులకు దమ్ముందా? అని ఆయన ప్రశ్నించారు. జగన్ సిద్ధం అని సభలు పెట్టి అశుద్ధం మాటలు మాట్లాడుతున్నాడన్నారు. జగన్ ఓటమి భయంతో బదిలీలు అంటూ 77 మందిని మడత పెట్టాడన్నారు. మిగిలిన వారిని 50 రోజుల్లో జనం మడత పెడతారన్నారు. రాష్ట్రంలో ఏ ఊరు వెళ్ళినా వైసీపీ పాలనలో విధ్వంసం కన్పిస్తుందన్నారు. వందల కోట్లు ఖర్చు చేస్తూ అధికార దుర్వినియోగంతో సిద్ధమని సభలు పెడుతున్నాడన్నారు. జగన్ నోటి నుంచి వచ్చేవి అన్ని అసత్యాలు, తప్పుడు ప్రచారాలని తెలిపారు. వార్తలు కవర్ చేసేందుకు వెళ్ళిన మీడియా సిబ్బందిపై దాడి చేయటం దుర్మార్గం అన్నారు. వచ్చే ఎన్నికలు నిజమైన పెత్తందారు జగన్‌కు, ఐదుకోట్ల మంది ప్రజలకు మధ్య యుద్ధమని కన్నా పేర్కొన్నారు.

భర్తను చంపిన భార్య, ప్రియుడుకి జీవిత ఖైదు

గుంటూరు(లీగల్), ఫిబ్రవరి19: మంగళగిరి మండలం, కృష్ణాయపాలెం గ్రామానికి చెందిన బుల్లా రవి హత్యకేసులో అతని భార్య, ఆమె ప్రియుడికి జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ సోమవారం మూడవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి జి.అర్చన తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. రవికి ఉద్దండరాయునిపాలేనికి చెందిన రాణితో వివాహం అయింది. పొలం పనులు చేసుకునే రవికి పుట్టకతోనే మూగ, చెవుడు వైకల్యం ఉంది. పెళ్లి తర్వాత పెనుమాక గ్రామానికి చెందిన కిరణ్‌తో రాణికి వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయంలో భార్యా, భర్తల మధ్య ఘర్షణ చోటుచేసుకోవటంతో రాణి నూతక్కిలో ఉన్న ఆమె అత్త ఇంటికి వెళ్లిపోయింది. కొద్దిరోజులకు తిరిగి వచ్చింది. అయినప్పటికీ కిరణ్‌తో తన వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తూనే ఉంది. ఎప్పటికైనా భర్త ఉండటం వారి సంబంధానికి ఇబ్బంది అని భావించి, రవిని తుదముట్టించాలనుకున్నారు. 2017 ఆగస్టు 14వ తేదీ ఉదయం రవి తన తండ్రి, భార్య రాణితో కలిసి బెండతోటకు కాయలు కోయటానికి వెళ్లారు. ఆ సమయంలో కిరణ్ వచ్చి రవిని గొంతు పట్టుకొని కింద పడేశాడు. పక్కనే ఉన్న రవి భార్య కొండరాయి తీసుకొని తలపై మోదింది. దీంతో రవి అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. పోలీసుల దర్యాప్తులో నిజాలు తేలటంతో భార్యపై, ప్రియుడిపై కేసు నమోదు చేసి, సీఐ ఎం.మధుసూదనరావు కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు రుజువు కావటంతో నిందితులకు జీవిత ఖైదు, రూ.వెయ్యి జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాసం సూరిబాబు వాదించారు.

ప్రణాళికాబద్ధంగా ఎన్నికల నిర్వహణ

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు



జాతీయ ఎన్నికల నిర్వహణ మాస్టర్ ట్రైయినర్‌లతో కలెక్టర్ ఢిల్లీరావు

విజయవాడ, ఫిబ్రవరి 19: రానున్న ఎన్నికలు విజయవంతం కావడానికి ప్రణాళికా బద్ధంగా వ్యవహరించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లకు సూచించారు. విజయవాడ మేరీస్టెల్లా కాలేజీలో సోమవారం తూర్పు గోదావరి, గుంటూరు, బాపట్ల, పల్నాడు, కృష్ణా, ఏలూరు, ఎన్టీఆర్, ప్రకాశం జిల్లాల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. జాతీయ స్థాయి మాస్టర్ ట్రెయినర్లు కుముద్‌కుమార్ ఝా, జీ.ఆర్ హరిశిల్పలు, ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, డిప్యూటీ సీఈవో ఎస్.మల్లిబాబు, ఆర్డీవో బీ.హెచ్ భవానీశంకర్ తదితరులు పాల్గొన్న ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఆర్వో, పీవోల పాత్ర చాలా ముఖ్యమైనదని చెప్పారు. మాస్టర్ ట్రెయినర్‌లు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ప్రణాళికాబద్ధంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహించి విజయవంతం చేయాలని సూచించారు. ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు 118 మందికి శిక్షణా ఇచ్చారని, ప్రస్తుతం ఈ ఐదు రోజుల శిక్షణా కార్యక్రమంలో 124 మంది ఏఆర్‌వోలకు శిక్షణా ఇస్తున్నామని తెలిపారు. ఎన్నికలలో అనుసరించాల్సిన విధివిధానాలపై ఆయన పలు సూచనలు చేశారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ మాట్లాడుతూ నిబద్ధత అవగాహన ముఖ్యమని చెప్పారు. సంబంధిత అంశాలపై ఆయన పలు సూచనలు చేశారు. డిప్యూటీ సీఈవో ఎస్.మల్లిబాబు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో సమన్వయం ముఖ్యమని, ఒత్తిడిని దూరం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రెయినర్లను కలెక్టర్ సత్కరించారు.

దుబాయ్ ట్రేడ్ సెంటర్‌లో

డబుల్ హార్స్ ఉత్పత్తుల స్టాల్



దుబాయ్‌లో డబుల్ హార్స్ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న సంస్థ ప్రతినిధులు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 19: గల్ఫ్ దేశాలలో ఒకటైన దుబాయ్ ట్రేడ్ సెంటర్‌లో తెనాలి డబుల్ హార్స్ సంస్థ తమ ఉత్పత్తుల స్టాల్‌ను ఏర్పాటు చేసిన అరుదైన అవకాశం దక్కించుకుంది. ట్రేడ్ సెంటర్‌లో 22వ గల్ఫ్ ఫుడ్ ఫెస్టివల్‌ను ఈ నెల 19 నుంచి 23 వరకు నిర్వహిస్తున్నారు. 127 దేశాల ఆహార సంస్థల తయారీదారులు వీక్షించేందుకు వచ్చారు. ఈ ఫుడ్ ఫెస్టివల్‌లో తమ ఉత్పత్తులను ప్రదర్శించామని డబుల్ హార్స్ ఎండీ మునగాల శ్యాంప్రసాద్ తెలిపారు. ఇటీవల కాలంలో ప్రపంచ ప్రమాణాలను అనుసరించి డబుల్ హార్స్ సంస్థ పలు ఉత్పత్తులు చేపట్టింది. ప్రపంచ మార్కెట్ అవసరాలను భవిష్యత్ వ్యూహాలను అవలంబించేందుకు ఈ ఫెస్టివల్ తమకు దోహదపడిందన్నారు. పలు దేశాల ఉత్పత్తులు, ప్రపంచ ప్రజలకు చేరువ అవుతున్నాయని, తమకు ఈ అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు.

రేపు వరంగల్‌కి ప్రత్యేక రైలు

గుంటూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా బుధవారం(ఈ నెల 21వ తేదీన) గుంటూరు నుంచి వరంగల్‌కి ప్రత్యేక రైలుని నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో సీహెచ్ రాకేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెంబరు.07016 గుంటూరు - వరంగల్ ప్రత్యేక రైలు బుధవారం ఉదయం 6.40కి బయలుదేరి విజయవాడ, మధిర, మోటుమర్రి, బోనకల్లు, చింతకాని, ఖమ్మం, పాపటపల్లి, డోర్నకల్, మహబూబాబాద్, కేసనముద్రం, నెక్కొండ, చింతపల్లి మీదగా మధ్యాహ్నం 12.30కి వరంగల్ చేరుకొంటుంది. ఈ రైలు అన్ని జనరల్ సెకండ్ క్లాస్ బోగీలతోనే ప్రయాణిస్తుందని సీపీఆర్‌వో తెలిపారు.

24, 25 తేదీల్లో నాలుగు జిల్లాల స్థాయి టెన్నిస్ పోటీలు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 19: పట్టణంలోని సీఆర్ క్లబ్‌లో ఈనెల 24, 25 తేదీల్లో నాలుగు జిల్లాల స్థాయిలో ఆహ్వాన టెన్నిస్ పోటీలను నిర్వహిస్తున్నట్టు క్లబ్ కార్యదర్శి పావులూరి శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల స్థాయిలో ఈ పోటీలు ఉంటాయని తెలిపారు. మొత్తం 70కి పైగా జట్లు ఈ పోటీల్లో పాల్గొంటాయని ఆయన తెలిపారు.

గంజాయి కేసులో ఐదుగురి అరెస్టు

చేబ్రోలు, ఫిబ్రవరి 19: వ్యసనాలకు బానిసలై గంజాయి కొనుగోలు చేసి వినియోగించటంతోపాటు, విక్రయిస్తున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు తెనాలి డీఎస్పీ రమేష్ తెలిపారు. చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ పొన్నూరు పట్టణానికి చెందిన షేక్ ఫజల్, కట్టెంపూడి గ్రామానికి చెందిన నున్నా యశ్వంత్, పట్టణానికి చెందిన ఓ మైనర్ బాలుడు గంజాయికి అలవాటు పడ్డారు. యడ్లపాడు మండలం, బోయపాలెం గ్రామంలో ఆంజనేయస్వామి బొమ్మ వద్ద బడ్డీకొట్టు నడుపుతున్న ఒరిస్సాకు చెందిన సరటోల రమాకంత్, ఆషీష్ కుమార్ పాండా వద్ద గంజాయి కొనుగోలు చేస్తున్నారు. అలాగే ఇటీవల సత్తెనపల్లికి చెందిన వ్యక్తి కూడా గంజాయి తాగుతూ వీరికి పరిచయం అయ్యాడు. ఈ నెల 18వ తేదీన షేక్ ఫజల్, యశ్వంత్, మరో వ్యక్తి బోయపాలెం వెళ్లి అక్కడ ఒరిస్సాకు చెందిన రమాకాంత్, ఆశీస్‌కుమార్ పాండాల వద్ద రూ.30 వేల విలువైన గంజాయిని కొనుగోలు చేసారు. ఈ గంజాయిని ఫజల్, యశ్వంత్ మరో మైనర్ బాలుడు కలిసి ఇంజనీరింగ్ కళాశాల వద్ద విద్యార్థులకు విక్రయించాలని పొన్నూరు నుంచి చేబ్రోలు వస్తుండగా మార్గ మధ్యలో సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ మహేష్‌లు తమ సిబ్బంది కొమ్మమూరు కెనాల్ వద్ద వీరిని అదుపులోకి తీసుకొన్ని విచారించిన్నట్లు చెప్పారు. నిందితుల వద్ద కిలో గంజాయి ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ కేసులో ఫజల్, యశ్వంత్, ఒరిస్సాకు చెందిన రమాకాంత్, అశీస్ కుమార్ పాండ, మైనర్ బాలుడిని అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ కేసును చేధించిన సిబ్బందిని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ రమేష్ తదితరులు

ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధం

● మాజీ ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 19: వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ రెక్కలు విరిసేంత కసితో రాష్ట్ర ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎవరి పాలనలో అభివృద్ధి.. ఎవరి పాలనలో విధ్వంసమో.. ప్రజలకు తెలుసని, దమ్ముంటే వైసీపీ నాయకులు బహిరంగ చర్చకు సిద్ధమేనా అని ప్రశ్నించారు. సీఎం జగన్ సిద్ధం అంటూ సభలు పెట్టి అశుద్ధపు మాటలు చెబుతున్నాడని అన్నారు. వచ్చే ఎన్నికలు జగన్ చివరి ఎన్నికలు అని, జగన్ టీంను మడత పెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. పది రూపాయలు ఇచ్చి రూ.100 లాగేస్తున్న జగన్‌ను రాష్ట్ర ప్రజలు ఏకోసానా నమ్మే స్థితిలో లేర అన్నారు. దేశంలో అత్యంత ధనిక ముఖ్యమంత్రిగా మారిన జగన్‌రెడ్డికి పేదల జీవితాల గురించి మాట్లాడే అర్హత లేదని తెలిపారు. రాయలసీమలో 52 నియోజకవర్గాల్లో ప్రయాణీకులను ఇబ్బంది పెట్టి పాఠశాలలకు సెలవులు ప్రకటించి ఆర్టీసీ బస్సులు, పాఠశాలల బస్సులను లాగేసి జనాన్ని రాప్తాడు సభకు తరలించాడన్నారు. పాత్రికేయుడిపై దాడి హేయం అన్నారు. జగన్మోహన్‌రెడ్డి పేరు చెబితే బాబాయిపై గొడ్డలి వేటు, కోడికత్తి, ప్రభుత్వ టెర్రరిజం, ల్యాండ్, శ్యాండ్, మైన్, మైనింగ్ మాఫియా, క్విడ్ ప్రోకో, అధిక ధరలు, పనులు, చార్జీల పెంపు, అప్పుల బాదుడు, దొంగ ఓట్లు, హింసా రాజకీయాలు గుర్తుకు వస్తాయని అన్నారు. రివర్స్ టెండరింగ్‌తో ప్రాజెక్టులన్నీ మూలన పడేసిన జగన్ ఈసారి ఎన్నికలలో ఓటమి తప్పదని యరపతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు.

విదేశాలకు పారిపోయేందుకు జగన్ సిద్ధం

● మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



సమావేశంలో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఫిబ్రవరి 19: జగన్ పేరు చెబితే రాష్ట్ర ప్రజలకు అవినీతితో పాటు బాబాయి హత్య గుర్తుకొస్తుందని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి సొమ్ముతో విదేశాలకు పారిపోవడానికి సిద్ధం చేసుకుంటున్నారని అన్నారు. దమ్ముంటే అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని, లక్షల కోట్లు దోచుకున్న నీవు చర్చకు ఎందుకు రావని అన్నారు. నీవు చేసిన ద్రోహానికి షర్మిల మోసపోయి నీపై పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. నీ బాబాయి కూతురు నీపై పోరాటం చేసేందుకు సిద్ధమని అన్నారు. త్వరలో మీ కుర్చీ మడత పెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ అరాచక వ్యక్తులు దాడి చేయడాన్ని ఈ సందర్భంగా ఆయన తీవ్రంగా ఖండించారు. జగన్ ఒక మీడియాకు అధినేత అయి ఉండి కూడా దాడులను ప్రోత్సహించడం ఎంతవరకు సమంజసమన్నారు. కార్యక్రమంలో దాసయ్య, మురళీకృష్ణయాదవ్, ఆయూబ్ ఖాన్, గోవిందరాజులు, పెమ్మసాని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయులపై దాడులు హేయం


● ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్



పొన్నూరుటౌన్, ఫిబ్రవరి19: వైసీపీ అవినీతి అక్రమాలు, ప్రభుత్వంపై ప్రజాగ్రహాన్ని ప్రజల ముందు బయటపెడుతున్నందునే మీడియాపై దాడులకు తెగబడుతున్నారన్ని మాజీ ఎమ్మెల్యే సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సోమవారం అన్నారు. రాప్తాడులో జగన్‌రెడ్డి సభలో ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణపై జరిగిన దాడిని నరేంద్ర కుమార్ తీవ్రంగా ఖండించారు. అలాగే ఇటీవల అమరావతిలో ఈనాడు విలేకరిపై జరిగిన దాడిని ఖండించారు. కొన్ని మీడియాలపై జగన్‌రెడ్డి పెంచుకున్న వ్యతికత, కక్షతో ఈ దాడులు జరగుతున్నాయన్ని ధ్వజమెత్తారు. వృత్తినే దైవంగా భావించి పనిచేస్తున్న పాత్రికేయులపై దాడి చేయించటం అమానుష చర్యగా పేర్కొన్నారు. ప్రజా విశ్వాసం కోల్పోయి రానున్న ఎన్నికల్లో ఓటమి తప్పదని తెలుసుకున్న జగన్‌రెడ్డి ఆయన పార్టీ శ్రేణులు అసహనంతో ఆంధ్రజ్యోతి విలేకర్లపై దాడులకు పూనుకుంటున్నారన్ని ఆరోపించారు. ఆంధ్రజ్యోతి విలేకరి శ్రీకృష్ణపై జరిగిన దాడిని ప్రజాస్వామ్యవాదులు అందరూ ఖండించాలన్ని నరేంద్ర కుమార్ డిమాండ్ చేశారు.

జగన్ ఐదేళ్ల విధ్వంసంపై చర్చకు సిద్ధమా?

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 19: సిద్ధ అంటూ ఊరూరా సభలు పెడుతున్న సీఎం జగన్ తన ఐదేళ్ల విధ్వంసం పై చర్చకు సిద్ధమా? అని మాజీమంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు సవాల్ విసిరారు. ప్రజావేదిక కూల్చటంతో మొదలైన విధ్వంసం పోలవరంలో మొదలైన రివర్స్ టెండరింగ్, అమరావతి ఉసురు తీస్తూ మొదలు పెట్టిన మూడు ముక్కలాట, అంతక ముందే కోడి కత్తి డ్రామా, గొడ్డలి వేటు రాజకీయం ఇలా ఎన్ని విధాలుగా జగన్ ప్రజలకు కీడు, రాష్ట్రానికి చేటు చేశారో చెప్పటానికి మేము సిద్ధం, చర్చకు మీరు సిద్ధమా? అని వైసీపీ నాయకుల పైనిప్పులు చెరిగారు. సోమవారం పట్టణంలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ పది రూపాయలు ఇచ్చి వంద రూపాయలు దోచుకోవటమే జగన్ మార్క్ సంక్షేమమా? అని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ రెక్కలు విరిచి వేయటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. 2019 ఎన్నికలే తనకు చివరి ఛాన్స్ అని తెలిసి జగన్ అంతులేని దోపిడీకి పాల్పడ్డారన్నారు. ఇసుక, మైనింగ్, మద్యం, కాంట్రాక్ట్‌లలో భూ దోపిడీల్లో వేల కోట్లు దోచేశారని, హత్యలు, అరెస్టులు కూల్చివేతల రాజకీయాలతో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించరన్నారు. అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం సభలో ఆంధ్రజ్యోతి కెమేరామెన్‌పై జరిగిన దాడి అత్యంత హేయమని, నిందితులను వెంటనే అరెస్టు చేయాలని ప్రత్తిపాటి డిమాండ్ చేశారు.

బస్ ఢీకొని వృద్ధురాలి మృతి

చెరుకుపల్లి, ఫిబ్రవరి 19: బస్ ఢీకొని రోడ్డు దాటుతున్న మహిళ మృతి చెందిన ఘటన చెరుకుపల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సురేష్ తెలిపిన కథనం ప్రకారం.. చెరుకుపల్లిలోని కొత్తపేటకు చెందిన సుశీల(62) ఐలాండ్ సెంటర్‌లో రోడ్డు దాటుతుండగా బస్సు ఢీకొంది. మహిళకు రెండు కాళ్ళు విరగ్గా దగ్గరలో ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. వైద్యం చేస్తుండగానే మహిళ మృతి చెందినట్లు చెప్పారు. సుశీలకు కుమారుడు సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

లిబరల్ ఆర్ట్స్ స్కూల్ ప్రారంభం



ఈశ్వరీ లిబరల్ ఆర్ట్స్ స్కూల్ ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ సత్యనారాయణన్, నికోలస్, ప్రశాంత్ మహాపాత్ర, వీసి మనోజ్‌కుమార్ తదితరులు

మంగళగిరి, ఫిబ్రవరి 19: ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రాంగణంలో బీఏ, బీఎస్సీ చదివే విద్యార్థుల కోసం కొత్తగా ఈశ్వరీ లిబరల్ ఆర్ట్స్ స్కూల్‌ను ప్రారంభిస్తున్నట్టు ఆ వర్సిటీ అధ్యక్షులు డాక్టర్ సత్యనారాయణన్ చెప్పారు. తన తల్లి గారైన ఈశ్వరీదేవి పేరిట ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో నూతనంగా ఏర్పాటుచేసిన లిబరల్ ఆర్ట్స్ స్కూల్‌ను సోమవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్‌కుమార్ అధ్యక్షతన ఏర్పాటైన సభలో మాట్లాడుతూ లిబరల్ ఆర్ట్స్ స్కూల్ ప్రత్యేకతలను గురించి వివరించారు. తమ ఈ స్కూల్‌లో కొత్తగా బీఎస్సీ, బీఏ విభాగాలలో వివిధ రకాల కోర్సులను ప్రవేశపెట్టామన్నారు. సైకాలజీ, ఎకనామిక్స్, ఇంగ్లీష్, హిస్టరీ వంటి సబ్జెక్టులలో పీహెచ్ఏ ప్రోగ్రామ్‌లను కూడ ప్రారంభిస్తున్నామని తెలిపారు. వర్సిటీ వైస్ ఛాన్సలర్ మనోజ్ ఆరోరా మాట్లాడుతూ తమ ఈ లిబరల్ ఆర్ట్స్ స్కూల్‌ను దేశంలోనే నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ పాలకమండలి సభ్యులు డాక్టర్ నికోలస్, డాక్టర్ జానకి బాక్లే, ప్రశాంత్ మహాపాత్రో, డాక్టర్ గోపాల్‌గురు, డాక్టర్ చందన్‌గౌడ, డాక్టర్ ప్రదీప్ ఖోస్లా, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్‌కుమార్, డీన్ విష్ణుపద్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు మిర్చియార్డులో ధరలు ఇలా...

గుంటూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,48,759 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 1,33,190 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డులో 95,912 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			సూపర్ 10	--	--
334	9500	19500	నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
నెంబరు. 5	14500	17500	తేజ	8000	21000
273	12500	18500	బ్యాడిగి	11000	20000
341	9000	21500	దేవనూరుడీలక్స్	11000	20200
4884	--	--	తెల్లకాయలు	5000	13000

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.42 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	150, 159,170
చికెన్ విత్ స్కిన్	290.00
చికెన్ స్కిన్ లెస్	300.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



జీజీహెచ్‌లో డయేరియా బాధితుల్ని పరామర్శిస్తున్న దేగల ప్రభాకర్

పబ్లిసిటీ మీదున్న ధ్యాస ప్రజారోగ్యంపై లేదు

● టీడీపీ గుంటూరు నగర అధ్యక్షుడు దేగల ప్రభాకర్

గుంటూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): డయేరియాతో ప్రజలు ప్రాణాలు కోల్పోతుంటే వైద్య ఆరోగ్యశాఖ మంత్రికి పబ్లిసిటీ మీదున్న పిచ్చి ప్రజల ఆరోగ్యంపై లేదని టీడీపీ నగర అధ్యక్షుడు దేగల ప్రభాకర్ విమర్శించారు. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులను సోమవారం ఆయన పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో డయేరియా విజృంభణ తీవ్ర స్థాయిలో ఉందని, ఇప్పటికి నలుగురు డయేరియాతో మృతిచెందినా అధికార పార్టీ నేతల్లో కనీస స్పందన లేదని, మానవత్వంతో వ్యవహరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యేకు చీమకుట్టినట్టు కూడా లేదని మండిపడ్డారు. నగరంలో అధికారులు, నాయకులు అసలు ఉన్నారా? అంటూ ఆయన నిలదీశారు. డయేరియా బాధితుల వివరాలను దాచి పెట్టాలని వైసీపీ నాయకులే అధికారులపై ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు సురక్షిత నీరు సరఫరా చేయడంలో గుంటూరు కార్పొరేషన్ పూర్తిగా విఫలమైందని, అధికారుల తీరును ఆయన దుయ్యబట్టారు.

ఫ్యాను రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధం

టీడీపీ గుంటూరు పశ్చిమ ఇన్‌చార్జి కోవెలమూడి



గుంటూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఫ్యాను రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధంగా వున్నారని టీడీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర(నాని) అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జగన్ సిద్ధం సభలుపెట్టి అశుద్ధం మాటలు చెబుతున్నాడన్నారు. 2019లో ప్రజలు ఇచ్చిన ఒక్క ఛాన్సే జగన్‌కు చివరి ఛాన్స్ అని తేల్చి చెప్పారు. ఓటమి భయంతో బదిలీలంటూ 77 మందిని జగన్ మడతపెట్టాడని, మిగిలినవారిని మరో 50 రోజుల్లో జనం మడత పెడతారని ఎద్దేవా చేశారు. రాయలసీమ లోని 52 నియోజకవర్గాల్లో ప్రయాణికులను ఇబ్బంది పెట్టి ఆర్టీసీ, స్కూలు బస్సుల్ని లాక్కొని జనాన్ని బలవంతంగా రాప్తాడు సభకు తరలించడం దుర్మార్గమన్నారు.

గొంతు తడుపుకోడానికే భయపడుతున్న జనం

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ



గుంటూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): నగర ప్రజలు గొంతు తడుపుకోవా లంటేనే భయపడే దుస్థితి వచ్చిందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ అన్నారు. గుంటూరు లోని తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జీఎంసీ ప్రజలప్రాణాలతో చెలగాట మాడుతోందన్నారు. కలుషిత నీటితో ప్రజల ప్రాణాలు పోతున్నా ఇంతవరకు సమస్య మూలాలపై దృష్టి సారించకపోవడం దుర్మార్గ మన్నారు. దాహంవేసి గొంతు తడుపుకోవడానికి నీరు తాగాల్సివస్తే ఎక్కడ ఆసుపత్రుల్లో చేరాల్సి వస్తుందోనని ప్రజలు హడలిపోతున్నారన్నారు.డయేరియా లక్షణాలతో మృతిచెందిన శ్రీనగర్‌వాసి గాజుల సూర్యనారాయ ణకు రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైద్యశాఖ మంత్రి విడదల రజని అసలు సమస్య లేనట్లే మాట్లాడుతుండటం దుర్మార్గమన్నారు.

ఫొటో జర్నలిస్టుపై దాడి దుర్మార్గం

గుంటూరు, ఫిబ్రవరి 19: వైసీపీ నిర్వహించిన బహిరంగ సభలో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ కృష్ణపై వైకాపా మూకలు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు జనసేన పార్టీ నగర అధ్యక్షుడు నేరెళ్ల సురేష్ తెలిపారు. ఇలాంటి దాడులు చేయడానికేనా నేను సిద్ధం అంటూ ముఖ్యమంత్రి రాష్ట్ర పర్యటనకు బయలుదేరాడని ఆయన మండిపడ్డారు. చొక్కా మడత పెట్టాల్సిన సమయం ఆసన్నమైందని స్వయంగా ముఖ్యమంత్రి వైసీపీ మూకల్ని రెచ్చగొడుతున్నాడని ఆయన ఆరోపించారు. జర్నలిజం వృత్తిని రాజకీయ కోణంలో చూడటం తగదన్నారు. శాంతి భద్రతలు కాపాడాల్సిన పోలీసు వ్యవస్థ రాజకీయాలకు అతీతంగా స్పందించాలని ఆయన కోరారు. మరోసారి ఇలాంటి దాడులు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, రాజకీయ పార్టీలకు, పోలీసులకు నేరెళ్ల సురేష్ విజ్ఞప్తి చేశారు.

సీఎం కుర్చీ విలువ దిగజార్చిన జగన్‌రెడ్డి

గుంటూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అబద్ధాలతో సీఎం కుర్చీ విలువ దిగజారుస్తున్నాడని టీడీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ విమర్శించారు. రాప్తాడు 'సిద్ధం' సభలో జగన్‌రెడ్డి చంద్రబాబుపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం ఆయన ఆధ్వర్యంలో హిందూ కాలేజీ సెంటర్లోని జ్యోతిరావు పూలే విగ్రహం వద నల్లరిబ్బన్లు ధరించి బీసీనేతలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 85 శాతం హామీల అమలుపై మాట తప్పి.. మడమ తిప్పిన సీఎం హామీల అమలుపై బహిరంగ చర్చకు రాగలరా అంటూ సవాల్ చేసారు. ప్రజల్ని నవమోసాలు చేయడమే కాకుండా 99శాతం హామీలు అమలు చేశానని పదేపదే అబద్ధాలు చెబుతూ సీఎం సీటు విలువ దిగజారుస్తున్నారు. కార్యక్రమంలో ఈశ్వరరావు, హనుమంతరాజు, గట్టి శ్రీనివాస్, వంగర ఏడుకొండలు, బత్తిన శంకర్, సురే శ్రీనివాసరావు, శంకర్, సోమశేఖర్, రావణ్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో సేవా దృక్పథం అవసరం

గుంటూరు, ఫిబ్రవరి 19 : రాజకీయాల్లో సేవాదృక్పదం అవసరమని, తద్వారానే వారు రాణించగలుగుతారని ప్రముఖ క్రికెటర్ ఎమ్మెస్కే ప్రసాద్ అన్నారు. సోమవారం గుంటూరు తూర్పు నియోజకవర్గం టీడీపీ నేత షేక్ ఆరిఫ్ కార్యాలయానికి క్రికెటర్ ఎమ్మెస్కే ప్రసాద్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనను టీడీపీ - జనసేన పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెస్కే మాట్లాడుతూ.. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఆరిఫ్ వంటి నాయకులు దొరకడం అదృష్టం అని, నియోజవర్గ ప్రజల కోసం ఆరిఫ్ తన సొంత నిధులు ఉపయోగించి పనిచేస్తున్నాడని కొనియాడరు. రానున్నకాలంలో ప్రతి ఒక్కరూ పార్టీకి అండగా ఉండి అధికారంలోకి రావడానికి కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న మాధవి, పాల్గొన్న సామినేని, చుక్కపల్లి, రాయపాటి తదితరులు

దొంగలు దోచని ధనం విద్య

●సక్కు గ్రూప్ ఆఫ్ కంపెనీస్ డైరెక్టర్ ముత్తవరపు మాధవి

● ఘనంగా కమ్మజనసేవా సమితి వార్షికోత్సవాలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి19: దొంగలు దోచని సంపద చదవు ఒక్కటేనని సక్కు గ్రూప్ ఆఫ్ కంపెనీస్ డైరెక్టర్ ముత్తవరపు మాధవి అన్నారు. కుందులరోడ్డులోని వసతిగృహ ఆవరణలో కమ్మజనసేవా సమితి 22వ వార్షికోత్సవ కార్యక్రమాలు ఆదివారం అర్ధరాత్రి వరకు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన మాధవి మాట్లాడుతూ.. విద్యతో పాటు జీవితపు విలువలను అలవరుచుకోవాలని సూచించారు. నిజాయితీ, ఇతరులకు సాయపడే గుణం వంటి లక్షణాలను విద్యార్థి దశనుంచే అలవర్చుకోవాలని సూచించారు. దాతల సాయం అందిపుచ్చుకొని మరొకరికి సాయంచేసే స్థాయికి ఎదగాలని ఆకాక్షించారు. మరో ముఖ్య అతిథి ప్రవాస భారతీయుడు చిగురుపాటి సాంబశివరావు, లీయో గ్లోబల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కంచేటి ప్రసన్న లక్ష్మీలు మాట్లాడుతూ గణాంక శాస్త్రంలో భారత దేశంలో ఉన్న ప్రావీణ్యత మూలంగా ప్రపంచదేశాలలో భారతీయులుకు గుర్తింపువచ్చిందన్నారు. అనంతరం డాక్టర్ కేఎస్ఎన్ ప్రసాదు ఫౌండేషన్ విజయవాడ వారు ఒక్కో విద్యార్థినికి రూ 9వేలు చొప్పున 11 మందికి విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్ష, కార్యదర్శులుసామినేని కోటేశ్వరరావు, చుక్కపల్లి రమేష్, నాట్కో సంస్థ, ఎగ్జిక్యూటివ్‌వైస్ ప్రెసెడెంట్ నన్నపనేని సదాశివరావు, మాజీఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాసరావు, వంకాయలపాటి బలరామకృష్ణయ్య, ఉపాధ్యక్షులు వడ్లమూడి నాగేంద్రం, కోశాధికారి గోరంట్ల పున్నయ్యచౌదరి, సంయుక్త కార్యదర్శి గుంటుపల్లి కోటేశ్వరరావు, మర్రిపూడి సీతారామయ్య, పాలకవర్గ సభ్యులు, విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డయేరియా మరణాలపై చర్చకు సిద్ధమా ?



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నసీర్

● ఎమ్మెల్యే ముస్తఫాకు మొహమ్మద్ నసీర్ సవాల్
● స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత
● ప్రజల నుంచి 178 అర్జీలు స్వీకరించిన కలెక్టర్
● పరిష్కరించాలంటూ అధికారులకు ఆదేశాలు

గుంటూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): నగరంలో కలుషిత నీరు తాగి సంభవించిన మరణాలను సహజ మరణాలుగా చిత్రిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా డయేరియా మరణాలపై చర్చకు రావాలని టీడీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్ సవాల్ విసిరారు. కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో సోమవారం ఆయన డయేరియా ప్రబలడంలో పాలకుల, నేతల నిర్లక్ష్యంపై ఫిర్యాదుచేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నగరంలో 15 రోజులుగా తాగు నీరు కలుషితమవుతోందని, ఆ నీరు తాగి ఐదుగుర మరణించారని, 215 మంది ఆస్పత్రి పాలయ్యారని, వారిలో 185 మంది డిశ్చార్జ్ కాగా, ఇంకా వందలాది మంది ఆర్‌ఎంపీల వద్ద చికిత్స పొందుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. కార్యక్రమంలో టీడీపీ కార్పొరేటర్ ముప్పవరపు భారతి, దయారత్నం, శ్రీను నాయక్, అన్వర్, సురే శ్రీను, ఆనంద్, జమీర్, హఫీజ్, నాయబా, గోళ్ళ ప్రభాకర్, నాయుడు మధు, ఏడుకొండలు, రవి తదితరులు పాల్గొన్నారు

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి : కలెక్టర్

గుంటూరు(తూర్పు): స్పందనకు వచ్చిన అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనకు 178 అర్జీలు వచ్చాయి. డీఆర్వో పెద్ది రోజా, డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీ కుమారి, రవీంద్ర రావు, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ విజయలక్ష్మీ కలసి ఆయన అర్జీలను స్వీకరించారు.

గనికపుడిలోని 198ఎకరాల వక్ఫ్ భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని వక్ఫ్ బోర్డు వైస్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ (స్టార్ మస్తాన్), జాయింట్ సెక్రెటరీ షేక్.సుభాని, సయ్యద్ సుభానిలు స్పందనలో ఫిర్యాదు చేశారు. మూడేళ్ల నుంచి దివ్యాంగ పెన్షన్ కోసం తిరుగుతున్నా స్థానిక సచివాలయ సిబ్బంది, వలంటీరు పట్టించుకోవడం లేదని స్థానిక స్వర్ణాభారతి నగర్ 20వ లైనుకు చెందిన షేక్ బాజీ ఫిర్యాదు చేశారు. దుగ్గిరాల మండలం, చింతలపూడి గ్రామంలోని 285,286 బూతులను సమస్యాత్మకంగా ప్రకటించి, అక్కడ పకడ్బందీ చర్యలు చేపట్టాలని దుగ్గిరాల మండల బీ జే పీ అధ్యక్షులు దానబోయిన వెంకట శివాజీ యాదవ్ వినతిపత్రం అందజేశారు. స్వామినాధన్ సిఫారసులకు అనుగుణంగా అన్ని పంటలకు మద్దతు ధర కల్పించాలని, అలాగే రైతులు అడుగుతున్న న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని ముస్లిం ఐక్య వేదిక సభ్యులు వినతిపత్రం అందజేశారు.

వృద్ధాప్య పెన్షన్ కోసం అనేక మార్లు దరఖాస్తు పెట్టినప్పటికి స్థానిక సచివాలయ సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానిక ఇజ్రాయేల్ పేటకు చెందిన మర్రిపూడి శ్యామ్‌సన్ వినతిపత్రం అందజేశారు. గుండె సమస్యతో బాధపడుతున్నానని సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం అందించేలా కలెక్టర్ చొరవ చూపాలని స్థానిక కోబాల్డ్ పేటకు చెందిన ఎస్.లక్ష్మీదేవి వినతిపత్రం అందజేశారు.

'పది' పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

● ఏర్పాట్లపై వివిధ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష

గుంటూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 10వ తరగతి పరీక్షలు సజావుగా నిర్వహించేలా పటిష్ట ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి సంబంధితశాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో 10వ తరగతి పరీక్షల నిర్వహణపై విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. మార్చి 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరిగే పదవ తరగతి పరీక్షలకు జిల్లాలో 420 ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్ నుంచి 31,291 మంది విద్యార్థులు 147 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. పరీక్షా కేంద్రాలకు నిర్దేశించిన సమయానికే సంబంధిత మెటీరియల్‌ను పోలీసు భద్రత మధ్య తీసుకువెళ్లాలన్నారు. పరీక్ష అనంతరం జవాబు పత్రాలు పరీక్షా కేంద్రం నుంచి పోస్టాఫీసుకు తరలించే వరకు చీఫ్‌సూపరింటెండెంట్లు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని, ఇందుకు డిపార్ట్‌మెంటల్ అధికారులు సహాయం అందించాలన్నారు. పరీక్షాకేంద్రాల్లోనూ, సమీప ప్రాంతాల్లో జిరాక్స్‌మిషన్లు, షాపులు పరీక్షల సమయం ముగిసే వరకు మూసివేయించాలన్నారు. అలాగే పరీక్షకేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేయాలని, 144 సెక్షన్ విధించాలని పోలీస్ శాఖాధికారులకు సూచించారు. విద్యుత్, మునిసిపల్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులకు తగు ఆదేశాలను జారీ చేశారు. పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను అధికారులందరు ఖచ్చితంగా పాటించి బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా, ఆర్‌జేడీ లింగేశ్వర రెడ్డి, డిఈఓ శైలజ, అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామ్ (ఏసిజిఇ) కె.వెంకట రెడ్డి, డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ సెక్రెటరీ లలిత్ ప్రసాద్, డిప్యూటీ డీఈవోలు ఎం.నిర్మల, పి.వేంకటేశ్వరరావు, అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.శివనాగేశ్వర రావు, పాల్గొన్నారు.

ముగిసిన రహదారి మాసోత్సవాలు

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి19: గత నెల 20వ తేది నుంచి జరుగుతున్న రహదారి మాసోత్సవాలు సోమవారంతో ముగిసాయి. డీటీసీ కార్యాలయంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా పీడీ నేషనల్ హైవేస్ అథారటీస్ పార్వతీశం హాజరై ప్రసంగించారు. 1033 హెల్ప్‌లైన్ రహదారి వాహనదారులకు బహుళ భాషా సేవలను అందిస్తుందని, అవసరాన్ని బట్టి టోల్ ప్లాజా అంబులెన్స్, పెట్రోల్ వాహనం, క్రేన్ ఇతర హైవే కార్యకలాపాల సౌకర్యాలతో అనుసంధానం చేస్తుందని వివరించారు. ఈ సేవలపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఆర్టీసీ డిపో మేనేజర్ షేక్ సలాం, ట్రాఫిక్ డీఎస్పీ వీవీ నాయుడు, రీజనల్ జాయింట్ రవాణ కమిషనర్ బీఎస్ కృష్ణవేణీ, డీటీసీ కరీంలు రహదారి నియమాలను వివరించారు. అనంతరం మాసోత్సవాల్లో సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మోటారు వాహన తనిఖీ అధికారులు టీ.రాఘవరావు, సంధ్య, సౌజన్య, మల్లీశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, ఫిబ్రవరి 19: నెహ్రూనగర్ సబ్‌స్టేషన్‌పరిధిలో విద్యుత్‌లైన్‌ల ఏర్పాటులో భాగంగా మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వెంకటాద్రిపేట ఫీడర్, నెహ్రూనగర్ పరిధిలోని వెంకటాద్రిపేట, న్యూ రైల్వే స్టేషన్ రోడ్డు, నెహ్రూనగర్ 8,9, 10, 11 లైన్లు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ పీహెచ్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.



విరాళం చెక్కును కలెక్టర్‌కు అందజేస్తున్న కోస్టల్ బ్యాంక్ అధికారులు

సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి

కోస్టల్ బ్యాంక్ రూ. లక్ష విరాళం

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 19: మాజీ సైనికులు, దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన వీర జవానుల కుటుంబాల సంక్షేమానికి చేపట్టే కార్యక్రమాలకు ఉద్దేశించిన సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని కోస్టల్ బ్యాంక్ రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ మేరకు బ్యాంకు ప్రతినిధులు సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్ శంకరన్ హాలులో జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి చేతుల మీదుగా విరాళానికి సంబంధించిన చెక్ అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా ముందుకు వచ్చి సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి కోస్టల్ బ్యాంక్ విరాళం అందించడం అభినందనీయమని అన్నారు. ఇదే స్పూర్తితో వ్యక్తిగతంగా సంస్థల తరఫున విరాళాలు అందజేయాలని పిలుపునిచ్చారు. దేశ రక్షణకు అహర్నిశలు కృషిచేసిన సైనికుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ వారి కుటుంబాలకు ప్రతి ఒక్కరూ అండగా ఉండాల్సిన అవసరముందని సూచించారు. కార్యక్రమంలో కోస్టల్ బ్యాంక్ క్లస్టర్ హెడ్ జె.హరి ప్రసాద్, మేనేజర్ షేక్ గౌస్ బాష, జిల్లా సైనిక సంక్షేమ అధికారిణి ఆర్ గుణశీలా, జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జస్టిస్ రామకృష్ణ ప్రసాద్‌కు చిత్ర కళా ప్రదర్శన ఫోటోలు అందిస్తున్న బాబు

ఉత్సాహంగా జాతీయ ఆర్ట్ ఎగ్జిబిషన్

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి19: క్రియేటివ్ ఫైన్ ఆర్ట్ అకాడమి, రాష్ట్ర క్రియేటివిటికల్చర్ సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జాతీయ స్థాయిలో 18వ చిత్రలేఖన పోటీలు సోమవారం ఉత్సాహంగా జరిగాయి, అకాడమి ఛైర్మన్ డాక్టర్ కేపీ బాబు, డైరెక్టర్ సునీత నిర్వహణలో వివిధ ప్రాంతాలకు చెందిన చిత్ర కళాకారులు పాల్గొని తమ చిత్ర కళలను ప్రదర్శించారు. అనంతరం జరిగిన బహుమతుల ప్రదానసభలో ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్, దంపతులు పాల్గొని ఉత్తమ కళాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. అకాడమీ నిర్వాహకులు అతిథులను సన్మానించారు. కార్యక్రమంలో కల్చర్ కమిషన్ సీఈవో ఆర్.మల్లికార్జునరావు, ఆర్టిస్ట్ జీవై గిరి, ప్రొఫెసర్ ఎం.రాజశేఖర్‌బాబు, డాక్టర్ ఉపేంద్ర, ఆశీర్వాదం పాల్గొన్నారు.

ముగిసిన విజయ గణపతి స్వామి బ్రహ్మోత్సవాలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి19: స్థానిక ఎస్వీఎన్ కాలనీ విజయ గణపతి స్వామి నవదశవ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. ఉదయం విజయ గణపతి స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం అలంకార పూజ, నిత్య లక్ష్మీ సుదర్శన, పారమాత్మిక మహాశాంతి హోమాలు, బలిహరణ, చూర్ణోత్సవం, అవబృత స్నానం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను వేద పండితులు నిర్వహించారు. సాయంత్రం వేళలో స్వామివారి ద్వాదశ ప్రదక్షిణములు, ఉంజల్ సేవలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ అధ్యక్షులు పావులూరి కిషోర్, కార్యదర్శి నల్లమోతు వెంకట రత్తయ్య, కోశాధికారి డాక్టర్ పుచ్చ వెంకట మల్లేశ్వర్ సభ్యులు పర్యవేక్షించారు.

నగరంలో వైభవంగా శోభా యాత్ర

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 19: ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా హిందూ చైతన్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం నగరంలో శోభాయాత్ర నిర్వహించారు. అందులో భాగంగా నిర్వహించిన సభకు ముఖ్య అతిథిగా తులసీ యోగేష్ హాజరయ్యారు. కార్యక్రమంలో చెరుకూరి శ్రీహరి, మున్నలూరి నాగేశ్వరరావు, కె. దుర్గాబాబు, యస్. వీరయ్యచౌదరి, భజరంగ్ రామకృష్ణ, రామమోహన్, సాయి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీలో నియామకాల కోలాహలం

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 19: గుంటూరు జిల్లా పరిషత్ లో ఖాళీగా ఉన్న ఆఫీసు సబార్డినేట్ ఉద్యోగాలను బ్యాక్ లాగ్ కోటా కింద భర్తీ చేశారు.సోమవారం జడ్పీ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ఎంపికైన అభ్యర్థులకు నియమాకపు పత్రాలను అందజేశారు. కొప్పురావూరి లక్ష్మయ్య, బుస్సా సరిత,ముక్కాల ఆదర్శని ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లోఆఫీసు సబార్డినేట్లుగా నియమించారు. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్ పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా మాట్లాడుతూ కొత్తగా ఉద్యోగాల్లో చేరినవారు క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు.

బహుజనులకు రాజ్యాధికారం కోసం ఉ.సా. కృషి

● ఉ.సా.కు ప్రజా సంఘాల నాయకుల ఘన నివాళులు

గుంటూరు, ఫిబ్రవరి 19: బహుజనులకు రాజ్యాధికారం కోసం మహాజనపార్టీ ఏర్పాటుచేసి అణగారినవర్గాల కోసం జీవితాన్ని త్యాగం చేసిన గొప్పనేత ఉప్పుమావులూరి సాంబశివరావు (ఉ.సా) అని ఆంధ్రప్రదేశ్ రజక జనసేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఉసా జయంతి సందర్భంగా కాకుమాను వారితోటలోని ఎస్టీ కాలనీ స్కూల్ సెంటర్‌లో ఉసా చిత్రపటానికి పలు ప్రజా సంఘాల నేతలు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జూపూడి మాట్లాడుతూ కమ్యూనిస్టు సిద్ధాంతం ద్వారానే పేదల జీవితాలు మారుతాయని నమ్మి పనిచేశారన్నారు. మహాత్మా జ్యోతిరావుపూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచనా విధానాలకు అనుగుణంగా సమాజంలో సమానత్వం కోసం చివరి వరకు కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో బహుజన మహాసభ సెంట్రల్ కమిటీ కార్యదర్శి జీఆర్ భగత్‌సింగ్, పీవీ రమణయ్య, సీహెచ్ వాసు, వట్టికూటి సాంబయ్య, పెనుమాక రమాదేవి, సాధన సత్యనారాయణ, పలుకూరి ప్రసాదరావు, పలుకూరి ప్రసాదరావు, గోవిందు, మురళీకృష్ణ, నిడుముక్కల రాంబాబు, లక్ష్మయ్య, అర్జున్‌రావు, తాళ్ళూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఉ.సా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

రేపు సాయంత్రం నుంచి

పలు ప్రాంతాల్లో నీటి సరఫరా నిలిపివేత

● తక్కెళ్ళపాడు వాటర్ ప్లాంట్‌లో మరమ్మతులు

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 19 : నగరంలో తక్కెళ్ళపాడు హెడ్ వాటర్ వర్క్సులోని 42 ఎమ్ఎల్ డీ ఫిల్టరేషన్ ప్లాంట్‌ను వార్షిక మరమ్మతుల నిమిత్తం బుధవారం నిలుపుదల చేయుట జరుగుతుందని నగరపాలక సంస్థ ఎస్ఈ. సుందరరామిరెడ్డి సోమవారం ఒకప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం వరకు నగరంలోని బీఆర్. స్టేడియం, ఐపీడీ కాలనీ, శ్రీనివాసరావు పేట, నల్లచెరువు, తారకరామా నగర్ ఆటోనగర్ ప్రాంతాల్లో త్రాగునీటి సరఫరాకు పాక్షికంగా అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. నగర ప్రజలు సహకరించి ముందుగా తగిన ఏర్పాట్లు చేసుకొనవలసినదిగా ఎస్ఈ. సుందరరామిరెడ్డి కోరారు.



నగరంలో వాటర్ ప్లాంట్ లను సీజ్ చేస్తున్న అధికారులు

నిబంధనలు పాటించని వాటర్ ప్లాంట్ల సీజ్

● కమిషనర్ ఆదేశాల మేరకు ప్లాంట్లలో తనిఖీలు

గుంటూరు (కార్పొరేషన్), ఫిబ్రవరి 19 : ప్రజారోగ్యానికి భంగం కల్గిస్తూ నిర్దేశిత ప్రమాణాలు పాటించకుండా నీటి విక్రయాలను చేసే మినరల్ వాటర్ ప్లాంట్‌లపై కఠిన చర్యలు తప్పవని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. నగర కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, పోలీసులు సంయుక్తంగా నిబంధనలు ఉల్లంఘించినట్లు రీజినల్ ల్యాబ్ గుర్తించిన మినరల్ వాటర్ ప్లాంట్‌లను సీజ్ చేశారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వివిధ ప్రాంతాల్లో అనధికార, ప్రమాణాలు పాటించని అనేక వాటర్ ప్లాంట్‌లు ఉన్నాయని, ఇటీవల గుంటూరు మెడికల్ కాలేజీలోని రీజినల్ ల్యాబ్ కొన్ని ప్లాంట్‌ల్లో శ్యాంపిల్స్ సేకరించిందని తెలిపారు. శ్యాంపిల్స్‌లో తొలుత శ్రీనగర్‌లోని సాయి ఫ్లేవర్స్ వాటర్ ప్లాంట్, కాకుమానువారితోటలోని బ్లూ డ్రాప్స్, శారదా కాలని మెయిన్ రోడ్ లోని శ్రీ తేజశ్రీ ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్, ఐపిడి కాలని మెయిన్ రోడ్డులోని లిల్లీ మినరల్ వాటర్ ప్లాంట్, అనురాధ వాటర్ ప్లాంట్, ఎన్జీవో కాలని సప్తగిరి ఎంటర్ ప్రైజెస్‌లను సోమవారం సీజ్ చేసినట్లు తెలిపారు. ఆదివారం కలెక్టర్ శ్రీనగర్ పర్యటన సమయంలో కూడా స్థానికులు శ్రీనగర్ లోని మినరల్ వాటర్ ప్లాంట్ నుండి విక్రయిస్తున్న నీరు అనారోగ్యాలకు కారణం అవుతుందని ఫిర్యాదు చేయగా, స్పందించిన కలెక్టర్ సదరు ప్లాంట్‌ను సీజ్ చేయాలని ఆదేశించారని తెలిపారు. దాడుల్లో సీఎంవోహెచ్ డాక్టర్ ఆషా, ఎంహెచ్‌వో మధుసూదన్, ఏసీపీ అజయ్ కుమార్, టీపీఎస్ సువర్ణ కుమార్, రసూల్, ఎస్ఎస్‌లు రాంబాబు, ఆయుబ్ ఖాన్, సోమశేఖర్, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాఠశాల వద్ద పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలి

● గ్రీవెన్స్‌లో ఎస్పీకి స్థానికులు, పాఠశాల హెచ్‌ఎం వినతి

గుంటూరు, ఫిబ్రవరి 19 : స్థానిక అరండల్ పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంజీవయ్య నగర్ మున్సిపల్ హై స్కూల్ వద్ద గంజాయి ముఠా ఆగడాలు పెచ్చుమీరు పోతున్నాయని స్థానికులు, ప్రధానోపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేశార.ఈ మేరకు సోమవారం నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు పూనూరు నాగేశ్వరరావు, అదేవిధంగా పాఠశాల హెచ్‌ఎం పోలీస్ కార్యాలయంలో స్పందనలో ఎస్పీకి ఫిర్యాదు చేశారు. కొంతమంది మద్యం, గంజాయి తాగి విద్యార్థినులు పాఠశాలకు వచ్చి, వెళ్లే సమయాల్లో వారిపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఇటీవల ఓ బాలికను బలవంతంగా కిడ్నాప్ చేసేందుకు ఆటలో ఎక్కించారని, స్థానికులుచూసి గొడవ చేయడంతో దించేసి వెళ్లిపోయారన్నారు. ఇప్పటికైనా పోలీస్ అధికారులు స్పందించి ఆ ప్రాంతంలో పోలీస్ అవుట్ పేస్టు ఏర్పాటు చేయడంతో పాటు ప్రతిరోజు పోలీసులు ఈ ప్రాంతంలో గస్తీ చేయాలని కోరారు.

థాయిలాండ్‌లో ఉద్యోగాలు ఇస్తామంటూ మోసం తమ పిల్లలకు థాయిలాండ్‌లో ఉద్యోగాలు ఇస్తామని నమ్మించి తమ నుంచి రూ 145 లక్షలు తీసుకొని మోసంచేశారని నగరంలోని మారుతినగర్‌లో గల నాయి బ్రాహ్మణ కాలనీకి చెందిన కే నాగ కళ్యాణి ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అలాగే తమ ఇద్దరు పిల్లలకు ఏఈఎల్సీలో ఉద్యోగాలు ఇస్తామని చెప్పి తన బావమ్మర్ది రాము, చెల్లెలు మల్లేశ్వరి మోసం చేశారని పొత్తూరి వారి తోటకు చెందిన తుపాకుల వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. తన ఇద్దరి పిల్లలకు ఉద్యోగాల కోసం వారికి రూ.14 లక్షలు వరకు ఇచ్చినట్లు బాధితుడు తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేఎల్ యూనివర్సిటీలో జరుగుతున్న విద్యార్థుల వరుస ఆత్మహత్యలపై సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు షేక్ కరీం ఆధ్వర్యంలో ఎన్ఎస్‌యూఐ నేతలు ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు చేశారు.



ఫిర్యాదుదారులను తనిఖీ చేస్తున్న భద్రతా సిబ్బంది

పోలీస్ కార్యాలయంలో భద్రత కట్టుదిట్టం ..

పోలీస్ కార్యాలయంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రతి సోమవారం స్పందనకు కొందరు మానసిక రోగులు వస్తుండటంతో వారి కారణంగా అటు తోటి బాధితులకు, అదేవిధంగా పోలీస్ అధికారులు, సిబ్బంది కూడా ఇబ్బంది కరమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో అటువంటివారిని కట్టడి చేసేందుకు పోలీసు అధికారులు పోలీస్‌కార్యాలయంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. అంతేగాక స్పందన కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదుదారులను క్షుణ్ణంగా తనిఖీచేసిన తర్వాతే లోనికి పంపాలని ఎస్పీ ఆదేశించారు.

మద్యం బాటిళ్లు తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

● నిందితుడు ప్రభుత్వ మద్యం షాపులో సూపర్‌వైజర్

గుంటూరు, ఫిబ్రవరి 19 : అక్రమంగా మద్యం బాటిళ్ళు తరలిస్తున్న వ్యక్తిని నగరంపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు సోమవారం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడిని మీడియా ఎదుట హాజరు పరిచి వివరాలను సీఐ వెల్లడించారు. సోమవారం తెల్లవారు జామున పెట్రోలింగు నిర్వహిస్తుండగా చుట్టుగుంట వద్దకు చేరేసరికి ఒక వ్యక్తి రెండు నల్లటి బ్యాగులను ద్విచక్రవాహనంపై పెట్టుకొని పోలీసు వారిని చూసి పారిపోవుటకు ప్రయత్నించారు. ఎస్ఐ, పోలీసులు ఆ వ్యక్తిని పట్టుకున్నారు. నిందితుడు చల్లావారిపాలెంకు చెందిన లక్కిరెడ్డి శివ రామకృష్ణారెడ్డి కాగా, అతను కంకరగుంట వద్ద ప్రభుత్వ మద్యం షాపులో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నట్లు తెలిపాడు. తనకు జీతం సరిపోక కొన్ని రోజుల నుంచి షాపులోని మద్యం బాటిళ్లను బయట అమ్ముతున్నట్లు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి మొత్తం 130 మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్ళు, వివరాలు వెల్లడిస్తున్న సీఐ నరేష్

షుగర్ ఇన్‌స్టిట్యూట్‌లో సర్టిఫికెట్ కోర్సు

దిక్సూచి DIKSUCHI

కాన్పూర్‌లోని నేషనల్ షుగర్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్ఎస్ఐ)- 'సర్టిఫికెట్ కోర్స్ ఇన్ షుగర్ రిఫైనరీ ఆపరేషన్స్'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం 20 సీట్లు ఉన్నాయి. రిటెన్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. కోర్సు వ్యవధి మూడు నెలలు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు ఫారాన్ని ఈ-మెయిల్ ద్వారా అప్‌లోడ్ చేసి హార్డ్ కాపీని కింది చిరునామాకు పంపాలి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతోపాటు షుగర్ ఫ్యాక్టరీ ప్రాసెసింగ్ హౌస్‌లో కనీసం రెండేళ్లు పనిచేసిన అనుభవం ఉండాలి. సంస్థ అందిస్తున్న సర్టిఫికెట్ కోర్స్ ఇన్ క్వాలిటీ కంట్రోల్ పూర్తిచేసి కనీసం రెండు సీజన్ల అనుభవం లేదా సంస్థ నుంచి షుగర్ బాయిలింగ్ సర్టిఫికెట్ కోర్సు ఉత్తీర్ణతతోపాటు మూడు సీజన్ల అనుభవం ఉన్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 ఏప్రిల్ 1 నాటికి 35 ఏళ్లు మించకూడదు. విదేశీ అభ్యర్థులను 38 ఏళ్ల వరకు అనుమతిస్తారు.

రిటెన్ టెస్ట్: పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. ఇందులో రెండు సెక్షన్లు ఉంటాయి. మొదటి సెక్షన్‌లో మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల నుంచి 35 ప్రశ్నలు; రెండో సెక్షన్‌లో షుగర్ ప్రాసెస్‌కు సంబంధించి 15 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు రెండు మార్కులు నిర్దేశించారు. పరీక్ష సమయం మూడు గంటలు. క్యాలిక్యులేటర్లను అనుమతించరు. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.12,000(విదేశీ అభ్యర్థులకు రూ.48,000)
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.300
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** మార్చి 25
- **ఈ మెయిల్ ద్వారా అడ్మిట్ కార్డ్‌ల జారీ:** మార్చి 28 నుంచి
- **రిటెన్ టెస్ట్ తేదీ:** ఏప్రిల్ 14
- **పరీక్ష కేంద్రం:** ఎన్ఎస్ఐ, కాన్పూర్
- **రిజిస్టర్డ్ పోస్ట్/కొరియర్ ద్వారా దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** డైరెక్టర్, నేషనల్ షుగర్ ఇన్‌స్టిట్యూట్, కల్యాణ్‌పూర్, కాన్పూర్-208017
- **ఈ-మెయిల్:** nsikanpureducation@gmail.com
- **వెబ్‌సైట్:** http:// nsi.gov.in



ఏపీ సెట్ 2024

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అర్హత పరీక్ష(ఏపీ సెట్ 2024) నోటిఫికేషన్‌ను ఆంధ్ర విశ్వవిద్యాలయం విడుదల చేసింది. రాష్ట్రంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు, డిగ్రీ కళాశాలల లెక్చరర్లు నియామకానికి అర్హత సాధించేందుకు ఈ పరీక్షను ఉద్దేశించారు.

సబ్జెక్టులు: ఆంత్రోపాలజీ, హిస్టరీ, కెమికల్ సైన్సెస్, కామర్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, ఎకనామిక్స్, ఎడ్యుకేషన్, ఇంగ్లీష్, ఎర్త్-అట్మాస్ఫియరిక్-ఓషన్ అండ్ ప్లానెటరీ సైన్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, జాగ్రఫీ, హిందీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్, లా, లైఫ్ సైన్సెస్, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, మేనేజ్‌మెంట్, మేథమెటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సంస్కృతం, సోషియాలజీ, సోషల్ వర్క్, తెలుగు, ఉర్దూ, విజువల్ ఆర్ట్స్

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: గరిష్ఠ వయోపరిమితి లేదు.

పరీక్ష విధానం: పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. పేపర్-1లో 50 ప్రశ్నలకు 100 మార్కులు, పేపర్-2లో 100 ప్రశ్నలకు 200 మార్కులు కేటాయించారు. పరీక్ష వ్యవధి మూడు గంటలు.

పరీక్ష రుసుము: జనరల్/ఈడబ్ల్యూఎస్ కేటగిరీకి రూ.1200. బీసీ కేటగిరీకి రూ.1000. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/ట్రాన్స్‌జెండర్ అభ్యర్థులకు రూ.700.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: మార్చి 6

పరీక్ష తేదీ: ఏప్రిల్ 28

వెబ్‌సైట్: https://apset.net.in/

ఏపీ అంబేద్కర్ గురుకులాల్లో ఇంటర్ ప్రవేశాలు

రిమైండర్

తాడేపల్లిలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్)- రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డా.బీ.ఆర్.అంబేద్కర్ గురుకులాలు, ఐఐటీ-మెడికల్ అకాడమీల్లో ఇంటర్ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. బీఆర్ఏజీ ఇంటర్ సెట్ 2024 ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. విద్యార్థులు సొంత జిల్లా గురుకులంలో ప్రవేశానికి మాత్రమే అప్లయ్ చేసుకోవాలి. అభ్యర్థి కోరుకున్న గ్రూప్ అక్కడ లేని పక్షంలో సంబంధిత జోన్ పరిధిలోని మరో జిల్లా గురుకులానికి అప్లయ్ చేసుకోవచ్చు. దరఖాస్తును ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తరవాత మార్పులకు అవకాశం లేదు. ఎంపికైన అభ్యర్థులకు విద్య, వసతి ఉచితం. క్రీడలకు ప్రాధాన్యమిస్తారు.

సీట్లు: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 164 గురుకులాల్లో ఎంపీసీ 5400, బైపీసీ 5400, ఎంఈసీ 800, సీఈసీ 1600, హెచ్ఈసీ 360 సీట్లు ఉన్నాయి.

- ఐఐటీ-మెడికల్ అకాడమీల్లో మొత్తం 600 సీట్లు ఉన్నాయి. వీటిలో ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లకు సమానంగా ఒక్కోదానిలో 300 సీట్లు కేటాయించారు. కృష్ణా జిల్లా-ఈడ్పుగల్లులోని బాలికల అకాడమీలో ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లకు ఒక్కోదానిలో 160 సీట్లు ఉన్నాయి. కర్నూలు-చిన్నటేకూర్‌లోని బాలుర అకాడమీలో ఒక్కో గ్రూప్‌లో 60 సీట్లు, గుంటూరు-అడవితక్కెళ్లపాడు బాలుర అకాడమీలో ఒక్కో గ్రూప్‌లో 80 సీట్లు ఉన్నాయి.

అర్హత: ప్రస్తుతం పదోతరగతి పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. తెలుగు మీడియంలో చదివిన వారు కూడా అర్హులే. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 17 ఏళ్లు మించకూడదు.

ఏపీ బీఆర్ఏజీ ఇంటర్ సెట్ 2024: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్దేశించిన పదోతరగతి సిలబస్ ఆధారంగానే ఉంటాయి. మేథమెటిక్స్ నుంచి 25; ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్, ఇంగ్లీష్(కాంప్రహెన్షన్ అండ్ గ్రామర్), లాజికల్ రీజనింగ్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 15 ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను బ్లూ/బ్లాక్ పెన్‌తో ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. సమాధానం తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు. మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ప్రశ్నలు తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ఉంటాయి. ఏపీ బీఆర్ఏజీ ఇంటర్ సెట్ 2024లో సాధించిన మెరిట్ ఆధారంగా ఐఐటీ - మెడికల్ అకాడమీల్లో ప్రవేశానికి షార్ట్‌లిస్ట్ రూపొందిస్తారు. వీరికి మాత్రమే మరో ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహిస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 23
- **ఏపీ బీఆర్ఏజీ ఇంటర్ సెట్ తేదీ:** మార్చి 10
- **ఐఐటీ-మెడికల్... టెస్ట్ తేదీ:** ఏప్రిల్ 21
- **వెబ్‌సైట్:** https://apbragcet.apcfss.in

(నిన్నటి తరువాయి)

ఎకానమీ: పరిశీలించినప్పుడు 2014లో 10, 2013లో 19 ప్రశ్నలు వచ్చాయి. ఎకానమీలో మౌలిక అంశాలపై అవగాహన పెంచుకోవాలి. బడ్జెట్, ఎకనామిక్ సర్వే నుంచి కూడా అధికంగా ప్రశ్నలు వస్తాయి. ఇటీవలి కాలంలో ఆర్బీఐ డిజిటల్ కరెన్సీ నగదు రహిత ఆర్థిక వ్యవస్థ, ఆర్బీఐ ద్రవ్య పరపతి విధానం, క్రిప్టోకరెన్సీ, స్టార్టప్ - యూనికార్న్ స్టార్టప్ వంటి అంశాలు వినిపిస్తున్నాయి. ఎంఎస్పీ(కనీస మద్దతు ధర) అంటే ఏమిటి? ఎవరు ఇస్తారు? ఏయే పంటలకు ఇస్తారు వంటివి చదవాలి. జీఎస్టీ ఆర్థిక సంఘం, భారత దేశ వృద్ధి అంచనాలు, యూపీఐకి సంబంధించి వివరంగా చదవాలి. బడ్జెట్లో ప్రభుత్వం ప్రకటించిన పథకాలు, ఆర్థిక సమీక్ష కచ్చితంగా, లోతుగా చదవాలి.

అండ్ టెక్నాలజీ బుక్ చదివితే మంచిది.

పర్యావరణం: 2020లో 10 ప్రశ్నలు, 2014, 2016లో 18 ప్రశ్నలు వచ్చాయి. పర్యావరణంలో జీవవైవిధ్యం, జీవవైవిధ్య సంరక్షణ, పర్యావరణ చట్టాలు, పర్యావరణ సంస్థలు, కమిటీలు, సమావేశాల గురించి ప్రశ్నలు వస్తాయి. వీటితోపాటు పర్యావరణ కాలుష్యానికి సంబంధించి భూ, జల, గాలి కాలుష్యం, రేడియోధార్మికత కాలుష్యం, కాలుష్య నివారణ చట్టాలు, నివారణ చర్యలు, ఓజోన్ పొర క్షీణత, గ్లోబల్ వార్మింగ్‌పై ప్రశ్నలు వస్తాయి. కాప్-27 సదస్సు గురించి చదువుతూ గతంలో జరిగిన సదస్సులు, వాటి తీర్మానాలను చదవాలి. ఏ సదస్సు ఏ అంశాన్ని ప్రధానాంశంగా తీసుకున్నదో చదవాలి. గత సంవత్సర కాలంలో రెడ్ లిస్టుకి సంబంధించి అంతరిస్తున్న జీవజాతులు, వృక్షజాతులను చదవాలి.

సివిల్స్ ప్రిలిమ్స్ ప్రిపరేషన్

తొలి మెట్టు నుంచే పట్టు సాధించాలి

ఎకానమీకి సంబంధించి ఎన్‌సీఈఆర్‌టీ 9-12 పుస్తకాలు చదివితే మౌలిక అంశాలపై అవగాహన ఏర్పడుతుంది. బడ్జెట్ 2023-24, ఎకనామిక్ సర్వే 2022-23 బాగా చదవాలి. మార్కెట్లో అందుబాటులో ఉన్న ఏదైనా ఒక స్టాండర్డ్ బుక్ చదవాలి.

జనరల్ సైన్స్: శాస్త్ర సాంకేతికతకి సంబంధించి 2019లో 7 అత్యల్పంగా, 2014లో అత్యధికంగా 16 ప్రశ్నలు వచ్చాయి. జనరల్ సైన్స్‌లో వ్యాధులు, విటమిన్‌లు, వృక్ష, జంతువులకి చెందిన సాధారణ అంశాలు ముఖ్యం. సైన్స్ అండ్ టెక్నాలజీలో కమ్యూనికేషన్స్, స్పేస్, ఐటీ, రోబోటిక్స్, బయోటెక్నాలజీ, డిఫెన్స్ వంటి అంశాల్లో నూతన ఆవిష్కరణలు, సమకాలీన డెవలప్‌మెంట్స్ పైన ప్రశ్నలు అధికంగా వస్తాయి. ఇటీవలి కాలంలో భారతదేశంతోపాటు ఇతర దేశాల అంతరిక్ష ప్రయోగాల గురించి ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. ఈసారి చంద్రయాన్-3, ఆదిత్య ఎల్1 ప్రయోగం తదితరాలపై కచ్చితంగా చదవాలి. వార్తల్లో నిలిచిన వ్యాధులు - సంక్రమణ, నివారణ చర్యల గురించి చదవాలి.

సైన్స్ అండ్ టెక్నాలజీ: సంబంధించి 6-10వ తరగతి వరకు ఎన్సీఈఆర్టీ పుస్తకాలు చదవాలి. ముఖ్యంగా సైన్స్ అండ్ టెక్నాలజీలో వర్తమాన అంశాలపై ఎక్కువగా ప్రశ్నలు వస్తాయి. ప్రాథమిక అంశాలు మొదట చదవాలి. కరెంట్ అఫైర్స్‌తోపాటు, వివిధ మంత్రిత్వశాఖల ఇయర్ ఎండ్ రివ్యూతోపాటు అప్డేట్స్ చదవాలి. సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించి ప్రాథమిక అంశాలకు రవి అగ్రహారి సైన్స్ అండ్ టెక్నాలజీ బుక్ చదివితే మంచిది.

ఆ జాతులకి సంబంధించిన జంతువు, వృక్షాన్ని బాగా చదవాలి. అందులో భాగంగానే దాన్ని భారతదేశంలో చట్టానికి అన్వయించుకోవాలి.

పర్యావరణంపై ఎన్‌సీఈఆర్‌టీ ఎన్విరాన్‌మెంట్ తోపాటు శంకర్ అకాడమీ 'అవర్ ఎన్విరాన్‌మెంట్' గాని లేదా రవి అగ్రహారి 'ఎన్విరాన్‌మెంట్' గాని లేదా 'పిఎంఎఫ్ఎస్ఐఏఎస్ ఎన్విరాన్‌మెంట్' బుక్ చదవాలి. ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి పుస్తకంతోపాటు బయాలజీ 11లోని 13-16 చాప్టర్స్ (ఎన్విరాన్‌మెంట్ బయాలజీ) చదవాలి.

వర్తమాన అంశాలు: గడచిన సంవత్సర కాలంలో జరిగిన జాతీయ, అంతర్జాతీయ అంశాలు చదవాలి. వీటితోపాటు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు విడుదలచేసే నివేదికలు, సూచికలు కచ్చితంగా చదవాలి. ఇటీవలి కాలంలో క్రీడలకు ప్రాధాన్యం పెరిగింది. వీటికి సంబంధించి పిఐబి వెబ్‌సైట్, ద హిందూ పేపర్ చదువాలి. అలాగే ఏదైనా ఒక ప్రముఖ సంస్థకి చెందిన కరెంట్ అఫైర్స్ మ్యాగజైన్ చదవాలి.

వీటితోపాటు ముఖ్యంగా జనరల్ స్టడీస్‌కి సంబంధించిన ప్రాక్టీస్ పేపర్లు రాయాలి. సుమారు 50-60 ప్రశ్నపత్రాలు ప్రాక్టీస్ చేస్తే అభ్యర్థికి నమ్మకం ఏర్పడుతుంది. ముఖ్యంగా గడిచిన 20 సంవత్సరాల్లో జరిగిన సివిల్స్ ప్రిలిమినరీ ప్రశ్నపత్రాలు ప్రాక్టీస్ చేయాలి.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

ఏపీ జర్నలిజం కాలేజీలో అడ్మిషన్స్

హైదరాబాద్‌లోని ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజం- పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ కోర్సులను రెగ్యులర్, దూరవిద్య విధానాల్లో అందిస్తున్నారు.

కోర్సులు

- **పీజీ డిప్లొమా ఇన్ జర్నలిజం:** కోర్సు వ్యవధి ఏడాది. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.
- **డిప్లొమా ఇన్ జర్నలిజం:** కోర్సు వ్యవధి ఆర్నెల్లు. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.
- **డిప్లొమా ఇన్ టీవీ జర్నలిజం:** కోర్సు వ్యవధి ఆర్నెల్లు. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.
- **సర్టిఫికెట్ కోర్స్ ఆఫ్ జర్నలిజం:** కోర్సు వ్యవధి మూడు నెలలు. పదోతరగతి ఉత్తీర్ణులు అర్హులు.
- **ప్రాస్పెక్టస్, దరఖాస్తు ఫారం పొందేందుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **చివరి తేదీ:** మార్చి 5
- **మొబైల్ నెం:** 9848512767; 7286013388
- **ల్యాండ్ లైన్ నెంబర్:** 040-79610940
- **వెబ్‌సైట్:** www.apcj.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/JV8uhJ5లో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

ధనుష్ @ 50 రాయన్




తమిళ చిత్రరంగ సూపర్‌స్టార్ ధనుష్ నటిస్తున్న 50వ చిత్రానికి 'రాయన్' అనే పేరు నిర్ణయించారు. తమిళ, తెలుగు, హిందీ భాషల్లో విడుదలయ్యే ఈ చిత్రంలో ధనుష్ ప్రధాన పాత్ర పోషించడమే కాకుండా దర్శకత్వం కూడా వహిస్తున్నారు. దర్శకుడిగా ఆయనకు ఇది రెండో సినిమా. యువ కథానాయకుడు సందీప్ కిషన్ మరో ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. కాళిదాస్ జయరామ్ కీలక పాత్ర లో నటిస్తున్నారు. ఈ ముగ్గురు ఉన్న 'రాయన్' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. ధనుష్ ఫుడ్ ట్రక్ ముందు నిలబడి ఉంటే, సందీప్ కిషన్ వాహనం లోపల, కాళిదాస్ దానిపైన కనిపించారు. ధనుష్ ఆప్రాన్ మీద రక్తపు మరకలు కనిపిస్తున్నాయి. ఈ పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తి పెంచుతోంది. ఎస్ జె సూర్య, సెల్వరాఘవన్, అపర్ణా బాలమురళి, ధుషార విజయన్ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఓం ప్రకాశ్ డీవోపీ. యాక్షన్ కొరియోగ్రాఫర్‌గా పీటర్ హెయిన్ వ్యవహరిస్తున్నారు. ఈ ఏడాదే చిత్రాన్ని విడుదల చేస్తామని చిత్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ ప్రకటించింది.



ప్రముఖ నిర్మాత దిల్ రాజు సోదరుడు శిరీష్ తనయుడు, హీరో ఆశిష్ రెడ్డి, అద్వితా రెడ్డిల వివాహం ఇటీవల జైపూర్‌లోని లీలా ప్యాలెస్ హోటల్‌లో గ్రాండ్‌గా జరిగింది. ఈ వివాహ వేడుకకు బంధువులు, సన్నిహితులతో పాటు పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు. ఈ జంట తమ మొదటి చిత్రాన్ని సోషల్ మీడియా లో షేర్ చేసింది. ఈ నెల 23న హైదరాబాద్‌లో రిసెప్షన్ ఏర్పాటు చేశారు దిల్ రాజు, శిరీష్. 'రౌడీ బాయ్స్' చిత్రంతో హీరోగా పరిచయమైన ఆశిష్ ప్రస్తుతం సెల్ఫిష్ చిత్రంలో నటిస్తున్నారు.

జాన్వీతో జంటగా...





ఒకప్పుడు మెగాస్టార్ చిరంజీవి, శ్రీదేవి జంట తెలుగు తెరపై ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. చిరంజీవి, శ్రీదేవిలానే రామ్‌చరణ్, జాన్వీకపూర్ కలసి నటిస్తే చూడాలనేది మెగా అభిమానుల కోరిక. గతంలో ఒకట్రెండు సందర్భాల్లో ఈ కాంబినేషన్ సెట్ చేసేందుకు ప్రయత్నాలు జరిగినా ఫలించలేదు. ఇన్నాళ్లకు ఈ క్రేజీ కాంబినేషన్ సెట్టయింది. రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో ఓ చిత్రం (ఆర్‌సీ 16-వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో రామ్‌చరణ్‌కు జోడీగా జాన్వీకపూర్ నటించనున్నారు. ఈ విషయాన్ని జాన్వీ తండ్రి బోనీకపూర్ సోమవారం ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. 'త్వరలోనే ఆర్‌సీ 16 షూటింగ్‌లో జాన్వీ పాల్గొంటుంది. రామ్‌చరణ్ లాంటి హీరోతో నటించడం జాన్వీకి మంచి అవకాశం. నా భార్య శ్రీదేవి లానే నా కూతురు కూడా విభిన్న భాషల్లో నటించి పేరు తెచ్చుకోవాలి' అని ఆయన ఆకాంక్షించారు. అలాగే తమిళ హీరో సూర్యతోనూ జాన్వీ ఓ చిత్రంలో నటిస్తున్నట్లు బోనీకపూర్ చెప్పారు. ప్రస్తుతం ఎన్టీఆర్ సరసన జాన్వీకపూర్ 'దేవర' చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రంతోనే ఆమె హీరోయిన్‌గా టాలీవుడ్ అరంగేట్రం చేస్తున్నారు. శంకర్ దర్శకత్వం వహిస్తున్న 'గేమ్‌ఛేంజర్' చిత్రం షూటింగ్‌లో రామ్‌చరణ్ పాల్గొంటున్నారు. ఏప్రిల్ నుంచి 'ఆర్ సీ 16' షూటింగ్ ప్రారంభం కానుందని తెలుస్తోంది.

ఘనంగా బాఫ్టా అవార్డుల వేడుక



జొనాథన్ గ్లేజర్



సిలియన్ మర్ఫీ

ప్రతిష్ఠాత్మక 77వ బ్రిటిష్ అకాడమీ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ అవార్డ్స్ (బాఫ్టా) ప్రదానోత్సవం లండన్‌లోని రాయల్ ఫెస్టివల్ హాల్‌లో ఆదివారం రాత్రి వేడుకగా జరిగింది. 'ఓపెన్ హైమర్' చిత్రం మెజారిటీ పురస్కారాలను కొల్లగొట్టింది. క్రిస్టఫర్ నోలన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటుడు (సిలియన్ మర్ఫీ), ఉత్తమ చిత్రం సహా మరో ఏడు విభాగాల్లో పురస్కారాలను గెలుచుకుంది. ఆ తర్వాతి స్థానంలో 'పూర్ థింగ్స్' చిత్రం ఐదు బాఫ్టా పురస్కారాలను గెలుపొందింది. ఉత్తమ నటిగా ఎమ్మా స్టోన్ నిలిచారు. బాలీవుడ్ కథానాయిక దీపికా పదుకొనే ఈ కార్యక్రమానికి ప్రత్యేకాకర్షణగా నిలిచారు. ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆమె సహ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. దీపిక చీరకట్టులో కనిపించి వేదికపై సందడి చేశారు. 'ది జోన్ ఆఫ్ ఇంట్రెస్ట్' చిత్రం ఉత్తమ ఆంగ్లేతర చిత్రాల కేటగిరీలో విజేతగా నిలవగా, దర్శకుడు జొనాథన్ గ్లేజర్‌కు దీపికా పదుకొనే పురస్కారాన్ని అందజేశారు.

పథకం ప్రకారం సిద్ధం



సాయిరామ్ శంకర్, ఆషిమా నర్వాల్, శ్రుతీ సోదీ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'ఒక పథకం ప్రకారం'. వినోద్ విజయన్ దర్శకత్వం వహిస్తూ, గార్లపాటి రమేశ్‌తో కలసి నిర్మిస్తున్నారు. సాయిరామ్ శంకర్ పవర్‌ఫుల్ అడ్వకేట్ పాత్ర పోషించారు. సముద్రఖని పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని మార్చిలో విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం సోమవారం ప్రకటించింది. ఈ సందర్భంగా వినోద్ విజయన్ మాట్లాడుతూ 'ఇదొక విభిన్నమైన థ్రిల్లర్. గోపీసుందర్ నేపథ్య సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణ. సిద్ శ్రీరాం పాడిన పాటలకు ప్రేక్షకుల నుంచి చక్కటి స్పందన లభిస్తోంది' అన్నారు. భానుశ్రీ, పల్లవి గౌడ్ కీలకపాత్రలు పోషించిన ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రాజీవ్ రవి.

ఊహించని క్లైమాక్స్‌తో...



వినూత్నమైన టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్‌తో తెరకెక్కుతోన్న చిత్రం 'ఇంద్రాణి'. యానీయా భరద్వాజ్, కబీర్ దుహాన్ సింగ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. స్టీఫెన్‌పల్లం దర్శకుడిగా పరిచయమవుతున్నారు. వెరోనికా ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్‌పై స్టాన్లీ సుమన్‌బాబు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్‌ను యూనిట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'నా సోదరుడు చెప్పిన కథతో ఈ సినిమాను తెరకెక్కించాం. షూటింగ్ పూర్తయ్యాక వీఎఫ్ఎక్స్ కోసమే ఏడాది పాటు కష్టపడ్డాం. ఈ సినిమా క్లైమాక్స్ ఎవరూ ఊహించలేని విధంగా ఉంటుంది' అన్నారు. అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో కూడిన మంచి సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ ఇదని నిర్మాత చెప్పారు. సినిమా ఓ దృశ్యకావ్యంలా ఉంటుంది, టైమ్ మెషీన్, రోబో ప్రేక్షకులను ఎంటర్టైన్ చేస్తాయి అని కబీర్ దుహాన్ సింగ్ తెలిపారు.

సరికొత్త కథాంశంతో...



విశ్వ కార్తిక్, ఆయూషి పటేల్ జంటగా నటించిన 'కలియుగం పట్టణం' చిత్రం షూటింగ్ పూర్తయింది. రమాకాంత్ రెడ్డిని దర్శకుడిగా పరిచయం చేస్తూ కందుల గ్రూప్ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. చిత్రం గురించి దర్శకుడు మాట్లాడుతూ 'టాలీవుడ్‌లో ఇలాంటి కాన్సెప్ట్‌తో ఏ సినిమా రాలేదు. సరికొత్త పాయింట్‌తో సందేశాన్ని మిళితం చేసి కుటుంబ సమేతంగా చూసే విధంగా చిత్రాన్ని రూపొందించాం. గ్యారీ బీ హెచ్ వంటి టాప్ టెక్నీషియన్ మా సినిమాకు ఎడిటర్‌గా పని చేశారు' అని చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/sdlBUL7లో చదవండి.

ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులకు విశ్వనాథ్ అవార్డ్



మహానటుడు అక్కినేని నాగేశ్వరరావుకు, కళాతపస్వి కె.విశ్వనాథ్‌కు మధ్య ఉన్న అనుబంధం చాలా ప్రత్యేకం. అక్కినేని నటించిన ఎన్నో చిత్రాలకు విశ్వనాథ్ అసోసియేట్ డైరెక్టర్‌గా పని చేశారు. అంతే కాదు ఏయన్నార్ నటించిన 'ఆత్మగౌరవం' సినిమాతోనే ఆయన దర్శకుడిగా పరిచయమయ్యారు. వీరిద్దరి అనుబంధాన్ని స్మరించుకుంటూ అన్నపూర్ణ కాలేజ్ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియాలో ప్రతిభ కనబర్చిన ఇద్దరు విద్యార్థులకు ప్రతి ఏడాది రెండు నగదు అవార్డులను ఇవ్వాలని విశ్వనాథ్ కుటుంబ సభ్యులు నిర్ణయించుకున్నారు. అన్నపూర్ణ స్టూడియోలోని అక్కినేని విగ్రహం దగ్గర నాగార్జున, అమలతో విశ్వనాథ్ తనయుడు నాగేంద్ర తన భార్య లక్ష్మి, కుమారుడు ప్రణవ్ కలసి సమావేశమై ఈ నిర్ణయం ప్రకటించారు. విశ్వనాథ్ సౌండ్ రికార్డిస్ట్‌గా కెరీర్ ప్రారంభించి, తర్వాత దర్శకుడు అయ్యారు కనుక ఆయన పేరిట సౌండ్ డిజైన్, డైరెక్షన్ రంగాల్లో అసాధారణమైన నైపుణ్యాన్ని ప్రదర్శించిన ఇద్దరు విద్యార్థులకు ఇకపై ప్రతి ఏడాది చెరో పాతిక వేల రూపాయలు అవార్డ్ రూపంలో అందజేస్తారు.



మలయాళంలో హిట్.. ఇప్పుడు తెలుగులో

మమ్ముట్టి ప్రధాన పాత్ర పోషించిన సైకలాజికల్ థ్రిల్లర్ 'భ్రమయుగం' ఇటీవల మలయాళంలో విడుదలై విజయం సాధించింది. చాలా కాలం తర్వాత పూర్తి బ్లాక్ అండ్ వైట్‌లో తయారైన ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ అధినేత సూర్యదేవర నాగవంశీ తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ నెల 23న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో ఉన్న వైవిధ్యమైన కథాంశం, మమ్ముట్టి అద్భుత నటన మలయాళ ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకున్నాయి. విమర్శకుల ప్రశంసలు పొందాయి. అందుకే అక్కడ ఈ సినిమాకు అద్భుతమైన స్పందన వచ్చింది. తెలుగు ప్రేక్షకులను కూడా ఈ చిత్రం అలరిస్తుందని నిర్మాత చెబుతున్నారు. అర్జున్ అశోకన్, సిద్ధార్థ్ భరతన్, అమల్దా లిజ్ తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రానికి రాహుల్ సదాశివన్ దర్శకుడు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

వానరాల దాడిలో వృద్ధురాలికి తీవ్రగాయాలు



వానరాల దాడిలో గాయపడిన వృద్ధురాలు బేబిసరోజని

తెనాలి రూరల్, ఫిబ్రవరి 19: నివాసగృహాల్లోకి వానరాల గుంపు దాడిచేయటంతో వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తెనాలి పట్టణంలోని పినపాడులో ఆదివారం సాయంత్రం వానరాలు (కోతులు) గుంపులు గుంపులుగా సంచరించాయి. నివాసాలలోకి ప్రవేశించి ఇంట్లో సామగ్రిని సైతం చెల్లాచెదురు చేశారు. ఇదేక్రమంలో పినపాడులో నివాసముంటున్న యల్లసిరి బేబిసరోజని అనే75ఏళ్ల వృద్ధురాలి ఇంట్లోకి వచ్చి ఆమెపై దాడిచేసి బీభత్సం సృష్టించాయి. కోతుల దాడితో ఒక్కసారిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు రావటంతో వానరాల మంద అక్కడినుండి చెట్లపైకి చేరాయి. తీవ్రగాయాలతో ఉన్న ఆమెను తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాలకు తరలించారు. గత కొన్ని నెలలుగా కోతులు తమ ప్రాంతంలో గుంపులుగా సంచరిస్తున్నాయని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. ఈ ఘటన జరగక ముందురోజు అదే ప్రాంతానికి చెందిన ఓ వృద్ధుడిపై కూడా వానరాలు దాడి చేశాయని తెలిపారు. అదే విధంగా రాత్రులు ఇదే ప్రాంతంలో కుక్కలు కూడా పాదచారులు, ద్విచక్రవాహనాలపై వెళుతున్న వారిపై దాడికి యత్నిస్తున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు కుక్క కాటుతో పలువురు సందర్శిస్తున్నారు. కుక్కలు, కోతుల నియంత్రణకు మునిసిపాలిటీ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎన్‌బీఎఫ్‌సీ నూతన శాఖ ప్రారంభం

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి: స్థానిక గంగానమ్మపేటలో ఫిన్వేస్కో క్యాపిటల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనే ఎన్‌బీఎఫ్‌సీ నూతన శాఖను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మేనేజింగ్ డైరెక్టర్ హ్యాపీ రిసార్ట్స్ అండ్ రిక్రియేషన్ అంబటి మధుమోహన్‌కృష్ణ, అసిస్టెంటు జనరల్ మేనేజర్, ఇండియన్ బ్యాంకు, నీలం సాంబశివరావు, వ్యాపారవేత్త తూనుగుంట్ల వెంకటేశ్వర గుప్తాలు పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంటు చంద్రశేఖర్, ఏరియా హెడ్ కె నాగరాజు, బిజినెస్ హెడ్ సయ్యద్ రియాజ్, బ్రాంచి హెడ్ ప్రకాశరావు, పి సాంబశివరావు, శ్రీనివాసరావు, ఫిన్వేస్కో సిబ్బంది పాల్గొన్నారు.



ట్యాంక్ బండ్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

ట్యాంక్ బండ్ నిర్మాణపనులు పరిశీలించిన ఎమ్మెల్యే

తెనాలి రూరల్, ఫిబ్రవరి 19: తెనాలి సుందరీకరణలో భాగంగా నిర్మిస్తున్న ట్యాంక్ బండ్ పనులను ఎమ్మెల్యే శివకుమార్ సోమవారం పరిశీలించారు. తెనాలి - మంగళగిరి ప్రధాన రహదారి వెంట వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కళాశాల సమీపంలోని ట్యాంక్ బండ్ నిర్మాణ పనుల్లో భాగంగా టైల్స్ విగ్రహాల నిర్మాణానికి ఏర్పాటు చేసిన దిమ్మెల నాణ్యతాప్రమాణాలను ఎమ్మెల్యే అధికారులతో కలిసి సందర్శించారు.

ఆసరాతో చెక్కుల పంపిణీ

తెనాలి రూరల్, ఫిబ్రవరి 19: వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా మహిళల రుణాలను మాఫీ చేసి వారికి అండగా నలిచామని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని మార్కెట్ యార్డు ప్రాంగణంలో వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాలుగో విడత రుణమాఫీ చెక్కును ఎమ్మెల్యే శివకుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు చేసిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చిందన్నారు. నాలుగు విడతలుగా డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తానని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటను నెరవేర్చారన్నారు. మహిళల అభ్యున్నతికి గత ప్రభుత్వాలతో పోల్చుకుంటే 100రెట్లు మిన్నగా జగన్ మోహన్‌రెడ్డి అర్థికాభివృద్ధికి పెద్దపీటవేశారన్నారు. రానున్న ఎన్నికల్లో తిరిగి ప్రభుత్వాన్ని నిలబెట్టుకుందామని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అన్నవరంలో సచివాలయం ప్రారంభం

కొల్లిపర, ఫిబ్రవరి 19: దేశంలోనే ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా మన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సువర్ణపాలన అందిస్తున్నట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని అన్నవరంలో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ సచివాలయం, వెల్‌నేస్ సెంటర్, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలకు సుమారు కోటి రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ అవసరాలు, ప్రజలకు సంబంధించి సంక్షేమం, ప్రజల అవసరాలను తీర్చటానికి సచివాలయ వ్యవస్థ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, సర్పంచ్ తాతా శ్రీలక్ష్మి, ఎంపీడీవో విష్ణుప్రసాద్, వైసీపీ మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి, ఎంపీటీసీ టి. భీమారాణి, మాజీ సర్పంచ్ బొమ్ము శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో స్పందనకు 8 అర్జీలు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 19: మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 8 అర్జీలు అందినట్లు తహసీల్దార్ ఎస్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. వాటిల్లో 3హౌస్ సైట్లు, 2 పట్టాదారు పాసు పుస్తకాలు కోసం రాగా మిగిలిన అర్జీలు ఇతర సమస్యలతో అందినట్లు వెల్లడించారు. అర్జీలను పరిశీలించి నిర్దిత సమయంలో పరిష్కరించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.



నూతన వధువుకి పెండ్లికానుకను అందిస్తున్న టీడీపీ నాయకులు

వధువుకు పెండ్లి కానుక అందజేత

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి: నియోజకవర్గంలోని తెలుగింటి ఆడపడుచుల వివాహానికి పెద్ద అన్నగా మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కుల మతాలకు, పార్టీలకు అతీతంగా మంగళసూత్రం లేదా బంగారు ఉంగరం కానుకగా అందిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం పట్టణంలోని 5వ వార్డులో పఠాన్ భాషాఖాన్, ఆరిఫా దంపతుల కుమార్తె షర్మిల వివాహంను పురస్కరించుకొని స్థానిక టీడీపీ నాయకులు నూతన వధువుకు ఆలపాటి రాజేంద్రప్రసాద్ పంపిన పెళ్లికానుక బంగారుపు ఉంగరంను చీర, సారెలను అందించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

దాడిపై ఫిర్యాదు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 19: పెదరావూరు హైస్కూల్ సమీపంలో చిరువ్యాపారం చేసుకుంటున్న రాయపూడి వెంకటస్వామిని అదే గ్రామానికి చెందిన జాషువా అనే వ్యక్తి తిట్టి విచక్షణారహితంగా దాడిచేశాడని బాధితుడు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తునట్లు రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు.

అన్న క్యాంటీన్‌లకు దాతల సహకారం అభినందనీయం



ఆహారం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 19: పట్టణంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లకు దాతల సహకారం అభినందనీయమని టీడీపీ నాయకులు, క్యాంటీన్ నిర్వాహక సభ్యుడు మాదల కోటేశ్వరావు అన్నారు. స్థానిక మార్కెట్ సెంటరులోని అన్న క్యాంటీన్‌లో, శివాజి చౌక్‌లోని అన్న క్యాంటీన్‌లలో సోమవారం కడియాల సుబ్బారావు, కడియాల రాజకుమారిల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల సహకారంతో పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సోమవరపు సాంబశివరావు, క్రొత్తపల్లి రమేష్, వెనిగళ్ళ శివప్రసాద్, గోగినేని రమేష్, గుమ్మడి ప్రసాద్, ముళ్ళపూడి వెంకట్, అక్కిశెట్టి వెంకటేశ్వరావు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి జర్నలిస్టుపై దాడి అమానుషం

● జర్నలిస్టు, అఖిలపక్ష నాయకుల నిరసన



పొన్నూరులో నిరసన ప్రదర్శన చేస్తున్న జర్నలిస్టులు, అఖిలపక్ష నాయకులు

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 19: అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణపై జరిగిన దాడి అమానుష చర్య అని పొన్నూరు వర్కింగ్ జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ షరీఫ్ అన్నారు. సోమవారం పొన్నూరు పట్టణంలో జర్నలిస్టు సంఘాలు, అఖిలపక్ష నాయకులు విలేకరులపై జరిగిన దాడులకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలోని ఐల్యాండ్ సెంటర్‌లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఐల్యాండ్ సెంటర్ బస్టాండ్, కూరగాయల మార్కెట్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను ఖండించాలని శ్రీకృష్ణపై దాడిచేసిన నిందితులను అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలన్ని పెద్దఎత్తున నినాదాలు చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన కొనసాగించి కార్యాలయంలో వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టు సంఘాల నాయకులు, అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టులపై జరుగుతున్న వరుస దాడులను తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో జరుగుతున్న దాడులు ప్రజలతోపాటు, జర్నలిస్టులను కూడా భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు నిజాలను నిర్భయంగా ప్రజల ముందు పెడుతున్న జర్నలిస్టులపై దాడులు చేయటం అప్రజాస్వామిక చర్య అన్నారు. తక్షణమే ఈ దాడులకు తెగపడుతున్న అల్లరి మూకలను అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసారు. జర్నలిస్టులకు రక్షణ చట్టాలను రూపొందించాలన్ని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో జర్నలిస్టుల సంఘాల నాయకులతోపాటు, టీడీపీ నాయకులు మాదాల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు, లక్ష్మీ నారాయణ చౌదరి, షేక్ బాజీసాహెబ్, ఫైరోజ్‌ఖాన్, సీతరామయ్య, పఠాన్ అహ్మద్‌ఖాన్, బండ్లమూడి బాబురావు, జనసేన నాయకులు కరిముల్లా, యరసాని నాగభూషణం, తాళ్లూరి అప్పారావు, దేశంపెట్టి సూర్య, యన్నం నాయుడు. బీజేపీ నాయకులు కలపాల శ్రీనివాసరావు, జి.కృష్ణారావు, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు తదితర అఖిలపక్ష నాయకులు నిరసనకు సంఘీభావం తెలిపి ర్యాలీలో పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వ పాలనలో అభివృద్ధి శూన్యం

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, పాల్గొన్న పార్టీ శ్రేణులు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 19: వైసీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని, సంక్షేమ పథకాల పేరుతో అన్నింటా ధరలు పెంచి ఒకచేత్తో ఇచ్చినట్లు ఇస్తూ పదింతలు మరోచేత్తో తిరిగి లాగేసుకుంటూ ప్రజలపైనే మోయలేని భారం మోపుతూ దుర్మార్గపు పాలనకు తెరలేపారని మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విమర్శించారు. సోమవారం పట్టణంలోని 17, 18వ వార్డుల్లోని పార్టీ శ్రేణులతో కృష్ణ బలిజ కమ్యునిటీ హాల్లో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో చేపట్టవలసిన కార్యాచరణను పార్టీ శ్రేణులతో చర్చించారు. పెద్ద సంఖ్యలో ఇరువార్డుల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను అమలుచేయాలి

● వైసీపీ, టీడీపీ మండల అధ్యక్షులకు వినతిపత్రం

కొల్లిపర, ఫిబ్రవరి 19: ఓపీఎస్‌ను అమలు చేస్తామనే హామీని వైసీపీ, టీడీపీ ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చవలసిందిగా కోరుతూ యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ నాయకులు సోమవారం మండల వైసీపీ కన్వీనర్ అవుతు పోతిరెడ్డికి, టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కుర్రా కేదార్‌నాథ్, మండల గౌరవ అధ్యక్షుడు రామకృష్ణప్రసాద్, మండల అధ్యక్షుడు శివశంకర్, ప్రధాన కార్యదర్శి ఎస్‌కే కాలేషా వలి, రాము, వహాబ్, వరప్రతాపకుమార్, ఝాన్సీ తదితరులు ఉన్నారు.

సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

● ఏపీ ఆర్యవైశ్య సత్రాల కమిటీ సభ్యుడు సుబ్బరంగయ్య

కొల్లిపర, ఫిబ్రవరి 19: సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు కృషిచేయాలని ఏపీ ఆర్యవైశ్య సత్రాల కమిటీ సభ్యుడు కునాగు సుబ్బరంగయ్య అన్నారు. సోమవారం కొల్లిపర ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమావేశానికి ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అన్నవరపు రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సుబ్బరంగయ్య మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘ నాయకులు ఐకమత్యంతో ముందుకు వెళ్ళాలన్నారు. అనంతరం కొల్లిపర మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా మునగాల రామలక్ష్మణరావు, కార్యదర్శిగా తాతా సతీష్‌కుమార్, కోశాధికారిగా తూనుగుండ్ల కిశోర్‌ను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పరిశీలకులు ముప్పల శ్రీనివాసరావు తెలియజేశారు. కార్యక్రమంలో సోనిశెట్టి సురేష్‌బాబు, ఆలపాటి పూర్ణచంద్రరావు, చుండూరు వెంకటరత్నం, సుగ్గుల సురేష్‌కుమార్, మునగాల శివకోటేశ్వరరావు, మునగాల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పోలీసు అధికారులతో మాట్లాడుతున్న న్యాయాధికారి జె.శ్రీసీత

మార్చి 9న జాతీయ లోక్ అదాలత్

తెనాలి క్రైం, ఫిబ్రవరి 19: కోర్టు ప్రాంగణంలో మార్చి 9న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని న్యాయాధికారులు సోమవారం కోర్టు ప్రాంగణంలో జరిగిన వేరు వేరు సమావేశాల్లో కోరారు. కక్షిదారుల సమావేశంలో ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి షేక్ అబ్దుల్ షరీఫ్‌లు పోలీసు అధికారులతో జరిపిన సమావేశంలో న్యాయాధికారి జె.శ్రీసీత మాట్లాడుతూ మార్చి 9న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారదిశగా తోడ్పాటు అందించాలని కోరారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో అన్నిరకాల సివిల్ కేసులు, రాజీపడదగిన క్రిమినల్ కేసులు, మనోవర్తి కేసులు, మోటారు వాహన ప్రమాద కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ తగాదాల సంబంధించిన కేసులు, బ్యాంకుకు సంబంధించిన కేసులు పరిష్కరించడం జరుగుతుందన్నారు. కక్షిదారులు ఈ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం వలన విలువైన కాలం, ధనం ఆదా అవ్వడంతో పాటు సామరస్యంగా కేసులు పరిష్కరించుకుంటే ఇరువురు విజేతలుగా నిలుస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



చినవెంకటరెడ్డిని వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారంతో సన్మానిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్ తదితరులు

వైఎస్సార్ కళాపరిషత్ నాటక పోటీలు ప్రారంభం


తెనాలి అర్బన్, ఫిబ్రవరి 19: వైఎస్సార్ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో సోమవారం నాటక పోటీలు ప్రారంభమయ్యాయి. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వైసీపీ నాయకులు గుదిబండి చినవెంకటరెడ్డికి వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. వైసీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు బూరెల నాంచారమ్మను పురస్కారంతో సత్కరించారు. అక్కిదాసు కిరణ్‌కుమార్, బొమ్మిరెడ్డి ప్రభాకర్, పెసర్లంక రమణ, మహేష్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, గరికపాటి సుబ్బారావు ప్రసంగించారు. ఇంద్ర ప్రస్థం, థ్యాంక్ ఫర్ ది పీఎం సాంఘిక నాటికలు ప్రదర్శించారు. పరిషత్ సభ్యులు పర్యవేక్షించారు.

వీవీఐటీలో 'ఈటీఎల్ సాంకేతికత'పై సదస్సు

పెదకాకాని, ఫిబ్రవరి 19: వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఏసీఎం విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఈటీఎల్ (ఎక్స్ట్రాక్, ట్రాన్స్‌ఫామ్, లోడ్) టెక్నాలజీ నాణ్యత, నియంత్రణ, ఇంజనీర్లకు కెరియర్ అవకాశాలపై సదస్సును సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యవక్తగా బహుళజాతీయ సంస్థ ఎస్అండ్‌పీ గ్లోబల్ అసోసియేట్ డైరెక్టర్ కసెట్టి అమర్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈటీఎల్ టెక్నాలజీ అనేది డేటాను పెద్దమొత్తంలో సమీకరించి విశ్లేషించడానికి ఎక్కువగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈటీఎల్ సాంకేతికతకు ఆదరణ లభిస్తుందని వ్యాపార ప్రయోజనాలు అధికంగా ఉండటం వలన విస్తృత అవకాశాలు ఈ రంగంలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వీవీఐటీ ప్రిన్సిపాల్ వై.మల్లికార్జునరెడ్డి, సీఎస్ఈ విభాగాధిపతి వి.రామచంద్రన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త మృతి

ఫిరంగిపురం, ఫిబ్రవరి 19: ఫిరంగిపురంలోని శాంతిపేటకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్త కే మేరీవర(47)కు బ్రెయిన్ స్ట్రోక్ రావటంతో నెల రోజులుగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిందని బంధువులు తెలిపారు. మృతదేహాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హేమలత, కళావతిలు సందర్శించారు.



శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అసోసియేషన్ సభ్యులు

చత్రపతి శివాజీకి ఘన నివాళి

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 19: చత్రపతి శివాజీ జయంతి వేడుకలు సోమవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ జిల్లా కర్తవ్యహ అంబటి మారుతీరామ్ మాట్లాడుతూ, అతి చిన్న వయసులోనే మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించి హిందూ సామ్రాజ్యాన్ని స్థాపించారని చెప్పారు. మరాఠీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. శివాజీ చౌక్‌లో శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మైలా హరికృష్ణ, అడపా సంపత్‌రాయుడు, రవి, కృష్ణ, సాయి, శివశంకర్, రామాంజనేయులు పాల్గొన్నారు.

పొన్నూరులో...

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 19: ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలను సోమవారం పొన్నూరు బ్లైడ్ వెల్ఫేర్ అసియేషన్ అధ్యక్షుడు తిరుమలశెట్టి ఉమాశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. చత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం విద్యానగర్ వృద్ధాశ్రమంలో కొనిశెట్టి శ్రీనివాసరావు సహకారంతో వృద్ధులకు కొబ్బరి నూనె పంపిణీ చేశారు. కార్యక్రమంలో పొన్నగంటి గోపి, రతమ్‌శెట్టి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, కౌన్సిలర్ సంజీవరెడ్డి తదితరులు

మురుగు కాల్వలపై ఆక్రమణలను తొలగించాలి

● మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 19: పట్టణంలోని బాలాజీరావు పేట 34వ వార్డులో సోమవారం పారిశుధ్య పనులను పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పర్యవేక్షించి సిబ్బందికి పలు సూచలను చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వార్డులో ఎక్కువ హోటళ్లు ఉండటం వలన, వారు మురుగు కాల్వలను ఆక్రమించుకొని వ్యాపారాలను నిర్వహిస్తున్నారని, అందువలన వ్యర్థాలు కాల్వలో పేరుకొని మురుగు నీరు పారడంలేదని తెలిపారు. వ్యాపారులు స్వచ్ఛందంగా తొలగించాలని లేకుంటే తామే తొలగిస్తామని హెచ్చరించారు. కౌన్సిలర్ సంజీవిరెడ్డి మాట్లాడుతూ ఈ సమస్యకు శాశ్వత పరిష్కారానికి చైర్‌పర్సన్ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

దళిత ద్రోహి జూపూడి ప్రభాకర్

● అంబేద్కర్‌ను అవమానిస్తున్న జగన్‌ను సమర్థిస్తావా..?

● రాష్ట్ర టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి సుశీల్‌రావ్ ధ్వజం

పెదకాకాని, ఫిబ్రవరి 19: వైసీపీ నాయకులు జూపూడి ప్రభాకర్ దళిత ద్రోహి అని, అంబేద్కరును అవమానిస్తున్న జగన్ని సమర్థిస్తావా అంటూ టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బొల్లెద్దుల సుశీల్‌రావ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పెదకాకాని మండలం తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ దళిత నాయకుల విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బొల్లెద్దుల సుశీలరావు మాట్లాడుతూ వైసీపీ పార్టీ నాయకుడు జూపూడి ప్రభాకర్‌రావు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విదేశీ విద్యా విధానం పేరును మార్చి జగన్ పేరు పెట్టినా దానిని సమర్థించటం దళిత జాతిని అవమానించినట్లేనని అన్నారు. జూపూడి ప్రభాకర్ ఊసరవెల్లి అని ధ్వజమెత్తారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి వెళ్లి తన ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టి కేవలం డబ్బులకోసం పనిచేసే వ్యక్తి జూపూడి ప్రభాకర్ అన్నారు. జాతిని అడ్డం పెట్టుకొని జాతిని తాకట్టు పెట్టి జగన్ బూట్లు నాకుతూ జగన్‌కు వంతపాడుతూ ఉన్నాడన్నారు. ఈ రోజున యావత్ దళితజాతి ప్రభాకర్‌ని ఎక్కడ కనపడితే అక్కడ చిత్తుచిత్తుగా కొట్టడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. అతని వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గారికి క్షమాపణచెప్పి యావత్ దళిత జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం ప్రభుత్వంలో అంబేద్కర్ విదేశీ విద్యా విధానంపై 4300 మందిని విదేశాలకు పంపడం జరిగిందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అనేక నిబంధనలతో నాలుగున్నర సంవత్సరాల తర్వాత కేవలం 37మందిని మాత్రమే విదేశీ విద్య విధానంపై విదేశాలకు పంపారన్నారు. పొన్నూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి ఆత్మకూరు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జూపూడి ప్రభాకర్ దళిత జాతికే కళంకమన్నారు. అంబేద్కర్‌నుద్దేశించి జూపూడి ప్రభాకర్ మాట్లాడిన పదాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం నాయకుడు లింగుంట్ల సాల్మన్ మాట్లాడుతూ మాకు డబ్బే ముఖ్యం ఎవరి పేరు పెడితే మాకేంటి అంబేద్కర్ పేరు కన్నా జగన్ పేరే ముఖ్యమని అనడం సిగ్గుచేటన్నారు. జూపూడి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల ఎస్సీ సెల్ నాయకులు బండ్లమూడి లాజరు బుల్ల చుక్కారావు పొన్నూరు నియోజకవర్గం నాయకులు విజయ్‌బాబు మజార్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ విధ్వంసపాలనపై నేడు టీడీపీ బహిరంగ సభ

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 19: నాలుగేళ్ల పది నెలల కాలంలో వైసీపీ విధ్వంసకర పాలనపై ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు పొన్నూరులో నేడు టీడీపీ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు టీడీపీ పట్టణ, మండల అధ్యక్షుడు పఠాన్ అహ్మద్‌ఖాన్, బండ్లమూడి బాబురావు తెలిపారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు మాట్లాడుతూ మంగళవారం సాయంత్ర ఐదు గంటలకు ఎన్టీరంగా విగ్రహం వద్ద ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ముఖ్యఅతిథిగా ఈ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రశాతంతకు నిలయమైన పొన్నూరులో నాలుగేళ్ల 10నెలల కాలంలో మునుపెన్నడు లేనివిధంగా దాడులు, దౌర్జన్యాలు, అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. ప్రజల ప్రశాతంతకు భంగం వాటిలిందన్నారు. ఆస్తుల విధ్వంసం యదేచ్ఛగా సాగిందన్నారు. గంజాయి మత్తు పదార్థులకు యువతను బానిసలుగా చేసి వైసీపీ రాబందులు రాజ్యమేలాయని ఆరోపించారు. భూకబ్జాలు, మైనింగ్ పేరుతో భూదోపిడి, దళిత, మైనార్టీల హత్యలు, నిరంతరం సాగాయని ఆరోపించారు. వీటన్నింటిపై ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు నిర్వహించిన బహిరంగ సభకు టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాల్సిందిగా కోరారు. సమావేశంలో చేబ్రోలు అధ్యక్షుడు మైలా వెంకటరామరాజు, వీరంకి రంగారావు, అనంతలక్ష్మీనారాయణ, మాదాల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు, పఠాన్ ఫిరోజ్‌ఖాన్, షేక్ బాజీసాహెబ్, తానికొండ లక్ష్మీనారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీని వినియోగించుకోవాలి

● పొన్నూరు డిపో మేనేజర్ అజితకుమారి



విజేతలకు బహుమతులు అందచేస్తున్న ఆర్టీసీ మేనేజర్ అజిత కుమారి

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 19: సురక్షిత ప్రయాణానికి ప్రజలు ఆర్టీసీని వినియోగించుకోవాలని ఆర్టీసీ పొన్నూరు డిపో మేనేజర్ టి.అజిత కుమారి అన్నారు. సోమవారం లక్కీడిప్‌లో గెలుపొందిన ప్రయాణికులకు బహుమతులు అందచేశారు. షేక్ ఖుద్దూస్, ఏ రాజు, ఎస్.హరిప్రియలకు ఈ లక్కీడిప్ బహుమతులను అందించారు. కార్యక్రమంలో పలువురు డిపో అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



వీల్‌చైర్లు అందజేస్తున్న రోటరీ క్లబ్ గవర్నర్ శంకర్‌రెడ్డి

దాతల సాయం అభినందనీయం

● రోటరీ క్లబ్ గవర్నర్ శంకరరెడ్డి

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 19: సమాజంలో పేదల కోసం రోటరీ క్లబ్ అందిస్తున్న సేవలకు దాతల చేయూత అభినందనీయమని రోటరీ క్లబ్ గవర్నర్ బి.శంకరరెడ్డి చెప్పారు. గంగానమ్మపేటలోని రోటరీక్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం కార్యాలయంలో సోమవారం ట్రైసైకిల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో పేదలను ఆదుకునేందుకు, రోగులకు చేయూత అందించేందుకు పాఠశాలల్లో విద్యాభివృద్ధి కార్యక్రమాలకు వివిధ రంగాల్లో పేరు పొందిన వారిని గుర్తించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్న క్లబ్ సభ్యులను అభినందించారు. ఇదే ఒరవడితో సేవా కార్యక్రమాలు కొనసాగించాలన్నారు. క్లబ్ అధ్యక్షులు పావులూరి రాంబాబు, కార్యదర్శి నల్లూరి వెంకటేశ్వరరావు, కన్నెగంటి మురళీకృష్ణ, జగదీశ్వరాంబ, పూర్ణచంద్, వెంకటరత్నం, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, కోటరియా తదితరులు పాల్గొన్నారు.

మాంటిస్సోరి స్కూల్‌లో విజ్ఞాన ప్రదర్శన

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 19: బుర్రిపాలెం రోడ్డులోని మాంటిస్సోరి స్కూల్‌లో సోమవారం స్టెమ్ ఎక్స్‌పో పేరిట విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు తాము నేర్చుకున్న పాఠ్యాంశాలను నమూనాలుగా తయారుచేసి ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ జేమ్స్ మోర్లే ప్రదర్శనను ప్రారంభించి విద్యార్థులు చేసిన నమూనాలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులలో దాగివున్న సృజనాత్మకత ప్రదర్శనల్లో చూపారని తెలిపారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించేందుకు పరిశోధనలు దోహదపడతాయన్నారు. సైన్స్, గణితంతో పాటు ఇతర సబ్జెక్టులకు సంబంధించిన నమూనాలను కూడా చేయడం విశేషం.

ప్రభుత్వ భూమిలో దర్జాగా రియల్ వెంచర్

● కాజలో విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణ

● గ్రామస్థుల ఫిర్యాదుతో పనులను అడ్డుకున్న ఎంటీఎంసీ

మంగళగిరి, ఫిబ్రవరి 19: మంగళగిరి ప్రాంతంలో ఆక్రమార్కులు చెలరేగిపోతున్నారు. ఎక్కడా ఖాళీజాగా కనిపించినా అది ప్రభుత్వ భూమా! ప్రైవేటు భూమా! అనే తారతమ్యం లేకుండా ఏవో కాగితాలను ఇట్టే పుట్టించేసి వాటికి సొంత యజమానులుగా చెలామణి అయిపోతున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే ఎన్నో ప్రైవేటు భూముల తాలూకు అసలైన యజమానులు కోర్టుల చుట్టూ తిరుగుతుండగా, ప్రభుత్వ భూములను గురించి అడిగేవారులేక అవి ఇట్టే అన్యాక్రాంతమై పోతున్నాయి. ముఖ్యంగా మంగళగిరి ప్రాంతంలో వాగు భూములు, చెరువు భూములు, వెంచర్‌ల ద్వారా నగరపాలకసంస్థకు దక్కిన స్థలాలు..రెవెన్యూ, ఆర్అండ్‌బీ పోరంబోకు భూములు, అటవీభూములు, చివరకు మున్సిపల్ బావులు.. ఇలా అన్నీ కబ్జాదారుల చేతులకు చిక్కి రూపుమారాయి. తాజాగా.. కాజగ్రామంలో పుల్లయ్యనగర్ సమీపాన జాతీయరహదారి వెంబడి ఉన్న సుమారు ఎకెరాల ప్రభుత్వ భూమిని కొందరు కబ్జాదారులు అధికారపార్టీ నాయకుల అండతో స్వాహా చేసేందుకు తెగబడ్డారు. ఈ భూమిని ఎంచక్కా ఆక్రమించి చక్కగా మెరకచేసి ఆపై రోలింగ్ చేసి రియల్ వెంచర్‌ను సిద్ధం చేసి ప్లాట్ల అమ్మకాలకు రంగం సిద్ధం చేశారు. ప్రైవేటు స్థలాన్ని అభివృద్ధి చేస్తున్న చందంగా నిత్యం అక్కడ రియల్ వెంచర్‌కు సన్నాహక ఏర్పాట్లు పట్టపగలే బహిరంగంగా జరుగుతున్నప్పటికీ అధికారులు నిద్ర నటిస్తున్నారు. దీనిపై కాజ గ్రామస్తులు ఆదివారం నగరపాలకసంస్థ కమిషనరు నిర్మల్‌కుమార్‌కు ఫిర్యాదు చేయగా ఆయన ఆక్రమణల తొలగింపుకు తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు కమిషనరు టౌన్‌ప్లానింగ్ డిప్యూటీ సిటీప్లానర్ ఆశోక్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బందిని పోలీసులను పంపి జరుగుతున్న పనులను నిలిపివేయించారు. అధికారులు సదరు భూమిని నగరపాలకసంస్థ స్వాధీనంలోకి తీసుకుని దాని రక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జనసేన నాయకుడు కంకణాల శంకర్ డిమాండ్ చేశారు.